తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 227

శుక్రవారం 23, జనవరి 2026

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥


## డిజిపి శివధర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, జితేందర్‌ను సిట్ పిలవదేం?

- టిఆర్ఎస్ ప్రభుత్వంలో మొదటి ఇంటెలిజెన్స్ ఐజీ ఎవరు?
- శివధర్ రెడ్డికి తెలుస్తది ఎవరి ఫోన్లు ట్యాప్ చేశారో... మాకేం తెలుస్తది?
- ఆ రోజు మా ఐజీ ఇంటెలిజెన్స్... ఆయనకు తెలవకుండానే జరిగిందా?
- ఓన్లీ పొలిటికల్ లీడర్లని ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?
- రేవంత్ బామ్మర్ది అమృత్ స్కామ్‌పై సిట్ వేయండి
- ఆర్ఆర్ టాక్స్ అంటారు.. దాని మీద సిట్ ఉండదు
- అది సిట్ కాదు పిట్ కాదు.. ఒక డెయిలీ సీరియల్
- రేవంత్.. ఈ హౌల పనులు బంద్ చేయమని చెప్తున్నా
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు, తనకు సిట్ నోటీసులపై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

4లో




# అడకత్తెరలో ఆ 10 మంది!

- ఎటూ కాకుండా పోయిన ఫిరాయింపు ఎమ్మెల్యేలు
- న్యాయస్థానం ద్వారా ఒత్తిడి తెస్తున్న బీఆర్ఎస్
- తమ పార్టీలో చేరారని చెప్పలేకపోతున్న కాంగ్రెస్
- స్పీకర్ జాప్యంతో అనర్హత వేటు తప్పించుకున్నా..
- ప్రజా కోర్టులో శిక్ష తప్పదన్న ఆందోళనలో నేతలు
- రాజకీయ భవిష్యత్తుపై కమ్ముకుంటున్న నీలినీడలు

**ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలిచి.. కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఇటు కాంగ్రెస్ లో చేరామని చెప్పుకోలేక, అటు బీఆర్ఎస్ లోనే ఉన్నామని చాటలేక.. 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటూ తోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఎన్నికల్లో ఒక పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచి.. మరో పార్టీలో చేరడం దేశంలో, ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల్లో సాధారణ అంశంగానే మారిపోయినప్పటికీ.. న్యాయస్థానాల జోక్యంతో ఇప్పుడది చర్చనీయాంశమైంది. ఓవైపు కోర్టు ఆదేశాలతో స్పీకర్ దశలవారీగా విచారణ కొనసాగిస్తుండగా.. మరోవైపు నైతికత అంశం వారిని ఇబ్బంది పెడుతోంది.**




2023 శాసనసభ ఎన్నికల్లో నాటి అధికార పార్టీగా ఉన్న బీఆర్ఎస్ ఓటమిపాలు కావడం, కాంగ్రెస్ మెజారిటీ సీట్లు గెలుచుకొని అధికారాన్ని దక్కించుకోవడం తెలిసిందే. అయితే కాంగ్రెస్ కు బొటాబొటి మెజారిటీ మాత్రమే ఉండడంతో.. ఆ పార్టీ 'ఆపరేషన్ ఆకర్ష్' కు తెరతీసింది. బీఆర్ఎస్ తరపున గెలిచిన ఎమ్మెల్యేలను 10 మందిని దశల వారీగా కాంగ్రెస్ లో చేర్చుకుంది. మంత్రి పదవుల కోసమో, కాంట్రాక్టుల కోసమో, మరే ఇతర కారణాలతోనే తమ ఎమ్మెల్యేల్లో ఎవరైనా తోక జాడిస్తే ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం రాకుండా ముందు జాగ్రత్తగా వీరిని కాంగ్రెస్‌లోకి తీసుకుంది. గతంలో బీఆర్ఎస్.. తమ ఎమ్మెల్యేలను చేర్చుకున్నట్లే తాము కూడా చేర్చుకున్నామని చెప్పాలని చూసింది. అయితే పరిస్థితి గతంలో కేసీఆర్‌కు అనుకూలించినట్లుగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలించలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక తొలి రెండు పర్యాయాలు అధికారం దక్కించుకున్న కేసీఆర్.. విచ్చలవిడిగా ఫిరాయింపులను ప్రోత్సహించారు. నాటి ప్రతిపక్ష కాంగ్రెస్ తోపాటు టీడీపీ సభ్యులనూ బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. చివరికి కమ్యూనిస్టు పార్టీని కూడా వదల్లేదు. అంతేకాదు.. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ లో చేరిన తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి వంటి వారికి మంత్రి పదవులు కూడా ఇచ్చారు. అయినా.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు చట్టపరంగా ఎటువంటి ఇబ్బందులు రాలేదు. మూడింట రెండొంతులు అనే నిబంధన వారిని కాపాడింది. ఆయా పార్టీల నుంచి రెండొంతుల కంటే ఎక్కువ మందే బీఆర్ఎస్ లో చేరడంతో వారిపై అనర్హత వేటు పడలేదు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళ్లినా ప్రయోజనం లేకపోయింది.

### రెండొంతుల మంది చేరనందునే..

ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి కూడా మూడింట రెండొంతుల మందిని చేర్చుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి భావించారు. కానీ, బీఆర్ఎస్ తరపున ఏకంగా 34 మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. వారిలో రెండొంతుల మంది అంటే కనీసం 23 మంది పార్టీ ఫిరాయిస్తేనే ఎవరిపైనా అనర్హత వేటు పడకుండా ఉంటుంది. అయితే 10 మంది ఎమ్మెల్యేలు మాత్రమే కాంగ్రెస్ లో చేరడంతో వారిపై బీఆర్ఎస్ న్యాయపోరాటానికి దిగింది. నైతికంగా చూస్తే బీఆర్ఎస్ కు ఆ హక్కు లేకపోయినా.. చట్టపరంగా పోరాడే హక్కు మాత్రం ఉంది. దీంతో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయాల్సిందేనంటూ పట్టుబడుతోంది. మరికొంతమంది ఎమ్మెల్యేలను లాగడం ద్వారా ఈ ప్రమాదం లేకుండా చూడాలని రేవంత్ రెడ్డి భావించారు. కానీ, బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి, పాత కాంగ్రెస్ నేతలకు పొసగని పరిస్థితి నెలకొంది. పలు చోట్ల ఫిరాయింపు ఎమ్మెల్యేలకు, ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున వారిపై పోటీ చేసి ఓడిపోయిన వారికి వైరం ఏర్పడింది. కొత్తవారిని కాంగ్రెస్ నేతలు సహించని పరిస్థితి తలెత్తింది. దీంతో ఇతర ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్లో చేరే విషయంలో వెనకడుగు వేయాల్సి వచ్చింది. ఇదే అదనుగా 10 మంది మిగతా.. 2లో



## ఎకనమిక్ ఫోరమ్ ఎండి జెరెమితో సీఎం రేవంత్ భేటీ

- తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను వివరించిన సీఎం
- 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ రోడ్‌మ్యాప్‌పై వివరణ
- హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు నిర్వహణకు విజ్ఞప్తి

**హైదరాబాద్,జనవరి 22(అక్షరగళం):** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరంఎండీ జెరెమి జర్గన్స్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఏటా హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని కోరారు. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని ఎకనామిక్ ఫోరం బృందం ఆయనకు తెలిపింది. సీ4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌తోనూ సీఎం భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలను రేవంత్ వివరించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీజ్గంన్స్, అ4ఎఖీ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలతో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు నిర్వహించే ప్రతిపాదనలను చర్చించారు. ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలో-అప్ సమావేశం నిర్వహించాలని ప్రతిపాదించారు. జనవరిలో జరిగే దావోస్ లో జరిగే సదస్సులోని చర్చలు, తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఫాలో అప్ సమావేశం ఉపయోగ పడుతుందన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో ఫాలో అప్ సదస్సు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న అవకాశాలు, పారిశ్రామిక రంగంలో ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలు, ప్రభుత్వ విధానాలను ప్రపంచానికి చూపించాలనే ఆలోచనను పంచుకున్నారు. అందుకే హైదరాబాద్‌లో ఫాలో అప్ ఫోరమ్ నిర్వహించాలలని కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. వివిధ దేశాల నుంచి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ.. సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీజ్గన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' జరుగుతోందని,సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్, లక్ష్యాలను సీఎం వివరించారు. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు వివిధ కోణాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమీజ్గన్స్ ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో తాము భాగస్వామ్యం పంచుకుంటామన్నారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు. హైదరాబాద్లో ప్రతిభావంతమైన మానవ వనరులున్నాయని మిగతా.. 2లో




## బిఆర్ఎస్ నేత కెటిఆర్‌కు సిట్ నోటీసులు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం
- నేడు 11 గంటలకు విచారణకు హాజరు కావాలని ఆదేశం


**హైదరాబాద్,జనవరి 22(అక్షరగళం):** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దూకుడు పెంచిన సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం నాడు మిగతా.. 2లో

## సోషల్ మీడియాకు పిల్లలను దూరం చేయాలి

- ఆస్ట్రేలియా తరహాలో కట్టడికి యత్నం
- సీఎం రేవంత్‌తో ప్రత్యేకంగా నారా లోకేశ్ భేటీ



**దావోస్,జనవరి22(అక్షరగళం):** ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడం పై అక్కడి ప్రభుత్వం డిసెంబరు నుంచి నిషేధం విధించిందని, ఇలాంటి సంస్కరణలు ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేసేందుకు పరిశీలిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పెట్టుబడులే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బృందం దావోస్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. మిగతా.. 2లో




## 27న బ్యాంక్ ఉద్యోగ సంఘాల సమ్మె

- బ్యాంకుల్లో ఐదురోజుల పని విధానానికి డిమాండ్

**హైదరాబాద్,జనవరి 22(అక్షరగళం):** దేశవ్యాప్తంగా ఈనెల 27న సమ్మె నిర్వహిస్తామని బ్యాంకు ఉద్యోగ సంఘాలు హెచ్చరించాయి. 5 రోజుల పని దినాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె చేస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ప్రకటించాయి. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం మిగతా.. 2లో

## నైని కోల్ బ్లాక్ టెండర్లపై విచారణ

- సింగరేణిపై కేంద్రం సంచలన నిర్ణయం
- ఇద్దరు సభ్యులతో కూడిన బృందం ఏర్పాటు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదేశం

**న్యూఢిల్లీ,జనవరి 22(అక్షరగళం):** తెలంగాణలో సంచలనం సృష్టిస్తోన్న నైని కోల్ బ్లాక్ టెండర్లపై విచారణ చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. నైని కోల్ బ్లాక్ విషయంలో వివాదం తలెత్తిన నేపథ్యంలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందం సింగరేణిలో పర్యటించనుంది. వివాదానికి, టెండర్ రద్దు చేయడానికి గల కారణాలు సహా ఇతర అంశాలపైనా సింగరేణి అధికారులతో కలిసి ఈ బృందం దర్యాప్తు చేయనుంది. ఈ బృందంలో బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, బొగ్గు శాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉన్నారు. ఈ బృందానికి కేంద్రం మూడు రోజుల సమయం ఇచ్చింది . మూడు రోజుల్లో సింగరేణిలో పర్యటించి.. నైని కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరిపి ఆ నివేదికను కేంద్రానికి అందజేయాల్సి ఉంటుంది. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్ల విషయంలోతీవ్రమైన ఆరోపణలు రావడంతో దీనిపై స్పందించిన తెలంగాణ మిగతా.. 2లో



## సింగరేణిపై కేంద్రానికి ఎలాంటి జోక్యం లేదు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలే ఆర్థిక విధ్వంసానికి కారణం
- సింగరేణి కార్మికుల సొత్తు కుటుంబాల ఆస్తి కాదు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,(అక్షరగళం):** సింగరేణి సంస్థపై కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ప్రత్యక్ష ఆజమాయిషీ మిగతా.. 2లో



## వీబీ జీ రామ్ జీకు వ్యతిరేకంగా ఆందోళన

- పార్లమెంట్ వేదికగా పోరాడుతాం: రాహుల్

**న్యూఢిల్లీ,జనవరి 22(అక్షరగళం):** ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ బిల్లు 'వీబీ జీ రామ్ జీ'కు వ్యతిరేకంగా పేద ప్రజలంతా ఏకం కావాలని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. కేంద్రం తెచ్చిన ఉపాధి హామీ మిగతా.. 2లో

## ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోండి..

- బిల్లులు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిది
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హామీ

**కొమురం భీం,జనవరి22(అక్షరగళం):** ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే కాదు వారం వారం బిల్లు ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ లబ్ధిదారులు ఏ ఒక్కరోజు ఆలస్యం చేయకండి. వడివడిగా ఇండ్లు కట్టుకోండి.. బిల్లు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిదే అని భట్టి తెలిపారు. మిగతా.. 2లో





## తమిళనాడు, కేరళ తరహాలో కర్నాటక గవర్నర్

- ఉభయసభల్లో ప్రసంగించకుండా నిష్క్రమణ
- గవర్నర్ తీరుపై సీఎం సిద్దరామయ్య ఆక్షేపణ
- రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించారని ఆగ్రహం

**బెంగళూరు,జనవరి22(అక్షరగళం):** తమిళనాడు, కేరళ మాదిరిగానే కర్ణాటకలోనూ గవర్నర్ వ్యవహారం వివాదాస్పదం అయ్యింది. కొత్త ఏడాదిలో కర్ణాటకలో తొలి అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగ ప్రతులను గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ చదవకుండా పక్కన పెట్టారు. మిగతా.. 2లో

## ధాన్యం దిగుబడితో పాటు.. కొనుగోలులోనూ రికార్డు

- 25 సంవత్సరాలలో ఇదే అత్యధిక రికార్డ్
- తెలంగాణ రైతాంగం భాగస్వామ్యంతోటే ఇంతటి విజయం
- ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంతో 14.20 లక్షల మంది రైతులకు లబ్ది
- బోనస్‌తో కలిపి చెల్లించిన మద్దతు ధర మొత్తం 18,532.98 కోట్ల చెల్లింపు
- వరి కొనుగోలులో అగ్రస్థానంలో నిజమాబాద్,నల్లగొండ జిల్లాలు
- పౌర సరఫరాల, నీటిపారుదల, వ్యవసాయ శాఖల విజయం : మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,జనవరి22(అక్షరగళం):** తెలంగాణా రాష్ట్రం ధాన్యం దిగుబడిలోనే కాకుండా ఖరీఫ్ సీజన్ లో కొనుగోలు చెందిన ధాన్యం దేశచరిత్రలోనే ఆల్ టైం రికార్డ్ నమోదు చేసుకుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గడిచిన 25 సంవత్సరాల వ్యవధిలో ఇదే అత్యధిక రికార్డ్ అని ఆయన చెప్పారు. 2025-26 రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకై పౌర సరఫరా శాఖ రూపొందించిన ప్రణాళికలపై గురువారం రోజున బేగంపేట ఐ.ఏ.ఎస్. ఆఫీసర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో జరిగిన సమీక్ష సమావేశానికి మంత్రి మిగతా.. 2లో

## వీబీ జీ రామ్ జీకు వ్యతిరేకంగా ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

చట్టాన్ని వెనక్కి తీసుకుని ఎంజీఎన్ఆర్ఈజీఏను పునరుద్ధరించేంత వరకూ తాము పోరాడతామని చెప్పారు. దీనిపై పార్లమెంటు బ్జడెట్ సమావేశాల్లోనూ పోరాటం సాగిస్తామని తెలిపారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టం ఉద్దేశం, గతంలో తీసుకువచ్చిన 'మూడు నల్ల వ్యవసాయ చట్టాల' ఉద్దేశం ఒకటేనని విమర్శించారు. జవహర్ భవన్‌లో గురువారం నాడు జరిగిన నేషనల్ ఎంజీఎన్ఆర్ఈజీఏ కార్మికుల సమావేశంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు ఉద్దేశానికే చరమగీతం పాడాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. రాజుల పాలనలా ఇండియాను మార్చాలని బీజేపీ అనుకుంటోందన్నారు. పేద ప్రజలందరికీ పని హక్కును ఎంజీఎన్ఆర్ఈజీఏ కల్పిస్తే, ఆ ఉద్దేశాన్ని దెబ్బతీయడమే బీజేపీ, మోదీ కోరిక అని తప్పుబట్టారు. కొద్దికాలం క్రితం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను వాళ్లు తెచ్చారని, అంతా కలిసికట్టుగా ప్రభుత్వంపై పోరాటం జరిపామని, రైతులు దాన్ని అడ్డుకున్నారని గుర్తు చేసారు. దాంతో ఆ నల్ల చట్టాలను కేంద్రం రద్దు చేసిందన్నారు. రైతుల విషయంలో అప్పుడు చేసినట్టే ఇప్పుడు అదే పని కార్మికుల విషయంలోనూ చేస్తున్నారని అన్నారు. కొత్త చట్టంతో బీజేపీ పాలిత రాష్ట్రాలకే పనులు, నిధులను కేంద్రం కేటాయిస్తుందని చెప్పారు. పేద ప్రజల పని హక్కును కేంద్రం హరిస్తూ, ఆధునిక భారత్‌ను విచ్ఛిన్నం చేయాలని కుట్ర జరుపుతోందని రాహుల్ ఆరోపించారు. కేంద్రాన్ని అడ్డుకునేందుకు అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్న ప్రతిఒక్కరూ ఐక్యంగా నిలబడినప్పుడే కేంద్రం వెనక్కి తగ్గుతుందన్నారు. ఈ సదస్సులో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పలువురు సీనియర్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోండి..

(మొదటి పేజీ తరువాయి)

జైనూర్ మండలంలోని జంగాం గ్రామంలో భట్టి విక్రమార్క పర్యటించారు. స్వయం సహాయక మహిళ సంఘాలకు రూ.3.41 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. నీటి పారుదల సమస్యలు అడిగారు. అప్పుడు బ్రిడ్జి అడిగారు. వాటి పనులు పూర్తి చేసే పనిలో ఉన్నామన్నారు. ఓజా కళాకారుల కళ ఎంతో గొప్పది అని కొనియాడారు. కళాకారులను ఆదుకుంటాం అని అండగా ఉంటా మని చెప్పాను. అందులో భాగంగా మీ ఓజా కళను కాడుకోవడం కోసం రుణాలు ఇచ్చే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందిరమ్మ చీరలు కట్టుకొని మహాలక్ష్మి ల్లాగా ఉన్నారు.. మహిళలకు ఇప్పటికే రూ.26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. మహిళల్ని కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. మీరు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే మేము డబ్బులు కడుతున్నామని తెలిపారు. నాడు వెయ్యి రూపాయలు లేని పరిస్థితిలో ఉన్న మహిళను నేడు బస్సులకు ఓనర్లను చేశాం.. చెప్పినట్టుగానే ధరణి తీసి భూ భారతి తెచ్చామని భట్టి తెలిపారు. కొమరం భీం ప్రాజెక్ట్ కెనాల్ కాలేదు అన్నారు.. వారికి ప్రపోజల్స్ పంపారు.. పనులు త్వరలో ప్రారంభం చేస్తామని హామీ ఇచ్చారు. దొడ్డు బియ్యం స్థానం లో సన్న బియ్యం ఇస్తున్నాం.. 96 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చాం. విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట, ప్రజా బాట పట్టారు. మీ సమస్యలు పరిష్కారం చేస్తారు. వారిని కలవండని గ్రామస్తులకు సూచించారు. 108 తరహాలో విద్యుత్ సమస్యల పైన 1912 ను సంప్రదించండి విద్యుత్ సమస్యలను పరిష్కారం చేస్తారని అన్నారు. మీ ప్రాంత సమస్య లను పరిష్కారం కోసం ఓ అంబులెన్స్ వస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి తెలిపారు.

### తమిళనాడు, కేరళ తరహాలో

## కర్నాటక గవర్నర్

(మొదటి పేజీ తరువాయి)

'ఈ రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ రెండు లైన్లలో తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం సభ నుంచి వెళ్లిపోయారు. ఈ వ్యవహారం గవర్నర్ కార్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య విభేదాలకు దారితీసింది. ఈ తీరుపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్యగా సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యలు చేశారు. రెండేళ్లుగా గవర్నర్ థావర్‌చంద్ కాంగ్రెస్ సర్కారు తయారుచేసిన సభా ప్రసంగాలను ఉభయ సభల్లో యథావిధిగా చదివారు. అయితే ఈసారి తన ధోరణిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే అంశాలతో తన ప్రసంగాన్ని సిద్ధంచేసిన తీరును ఆయన ముందుగానే ఆక్షేపించారు. దాంతో గురువారం అసలు ఆయన సభకు వస్తారా లేదా అనే ఉత్కంఠ కనిపించింది. అయితే ఎట్టకేలకు సభకు వచ్చిన ఆయన్ను సీఎం ఆహ్వానించారు. దాంతో ఆ ప్రసంగంపై అభిప్రాయభేదాలు పరిష్కారం అయ్యాయనే అభిప్రాయం కలిగింది. కానీ కొద్దిసేపటికే అలాంటిది ఏమీ లేదని అర్థమైంది. ఆయన కేవలం రెండులైన్లు చదివి సభ నుంచి వెళ్లిపోయారు. క్యాబినెట్ సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదవకుండా తాను సిద్ధం చేసుకున్న ప్రసంగాన్ని గవర్నర్ చదివారు. ఆయన రాజ్యాంగబద్ధంగా వ్యవహరించలేదు. దీనిపై మేం నిరసన తెలియజేయ నున్నాం. అలాగే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని పరిశీలిస్తున్నాం అని సిద్ధరామయ్య అన్నారు. కర్ణాటక అసెంబ్లీ సమావేశాల్లో ప్రారంభం రోజే హైడ్రామా నడిచింది. ఉపాధి హామీ పథకానికి సవరణలు వద్దనే తీర్మానంపై కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగాన్ని గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్.. కేవలం రెండు లైన్లు చదివేసి సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక పురోగతి వేగాన్ని రెట్టింపు చేయడానికి కట్టుబడి ఉంది. జై హింద్, జై కర్ణాటక!' అంటూ ప్రసంగాన్ని ముగించారు గవర్నర్. దీంతో గవర్నర్ తీరుపై కాంగ్రెస్ నేతలు భగ్గుమన్నారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'లోక్ భవన్ బీజేపీ కార్యాలయంగా మారిందా అని గవర్నర్‌ను ప్రశ్నించారు. గవర్నర్ గహ్లోత్ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన తర్వాత.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. 'ప్రతి కొత్త సంవత్సరం గవర్నర్ అసెంబ్లీ ఉమ్మడి సమావేశంలో ప్రసం గించాలి. ఆ ప్రసంగ పత్రాలను క్యాబినెట్ తయారు చేయాలి. ఇది రాజ్యాంగబద్ధమైన అవసరం. నేడు క్యాబినెట్ తయారు చేసిన ప్రసంగాన్ని చదవడానికి బదులుగా గవర్నర్ స్వయంగా రూపొందించుకున్న ప్రసంగాన్ని చదివారు. ఇది భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 176, 163ను ఉల్లంఘనల కిందకు వస్తుంది. రాజ్యాంగం ప్రకారం.. ఆయన తన విధులను సక్రమంగా నిర్వర్తించలేదు. అందువల్ల గవర్నర్ వైఖరికి వ్యతిరేకంగా నిరసన తెలపబోతున్నాం. సుప్రీంకోర్టును ఆశ్రయిం చాలా వద్దా.. అని పరిశీలిస్తున్నాం' అని సీఎం సిద్ధరామయ్య అన్నారు.

## గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ వ్యాఖ్యల దుమారం

### అక్కడ ఏం జరుగుతుందో మాకనవసరం


### ట్రంప్ వ్యాఖ్యలకు రష్యా అధ్యక్షుడు కౌంటర్

**మాస్కో,జనవరి22(అక్షరగళం):** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. గ్రీన్‌లాండ్ భద్రతకు చైనా, రష్యా నుంచి ముప్పు పొంచి ఉందని చేసిన ఆరోపణలను మాస్కో తిప్పికొట్టింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు జాతీయ భద్రతా మండలి సమావేశంలో పుతిన్ స్పందిస్తూ.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'గ్రీన్‌లాండ్‌లో ఏం జరుగుతుందో మాకు అనవసరం. మొదటి నుంచి గ్రీన్‌లాండ్‌ను డెన్మార్క్ ఒక చిన్న ప్రాంతంగానే చూసింది. ప్రస్తుతానికి ఈ అంశంపై ఎవరికీ పట్టింపు, ఆసక్తి లేదని నా ఉద్దేశం' పుతిన్ చెప్పారు. ఎవరెన్ని రకాలుగా బెదిరించినా.. ఈ విషయంలో రష్యా ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రీన్‌లాండ్ వ్యవహారం అమెరికా, డెన్మార్క్‌లు కలిసి పరిష్కరించుకుంటాయని పుతిన్ చెప్పారు.

# ధాన్యం దిగుబడితో పాటు.. కొనుగోలులోనూ రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవదిలో అనుసరించిన విధా నాల ఫలితమే ధాన్యం దిగుబడి, కొనుగోలులోనూ సంచలనాత్మక రికార్డ్ నమోదు చేసుకుందని ఆయన చెప్పారు. పౌరసరఫరాల శాఖా,నీటిపారుదల, వ్యవసాయ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవ డంతో పాటు తెలంగాణా రైతాంగం భాగస్వామ్యం తోటే ఇంతటి విజయం సాధించామని ఆయన చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణా రాష్ట్రానికి దక్కిందన్నారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రాలలో లేవని ఆయన తెలిపారు. 2020-21 లో నమోదు అయిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డ్ ను అధిగమించి తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్ లో71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధర తో పాటు సన్నాలకు మొట్టమొదటి సారిగా తెలంగాణా ప్రభుత్వం అందిస్తున్న బోనస్ తో కలిపి మొత్తం 18,532.98 కోట్ల రూపాయలను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించామన్నారు. ఖరీఫ్ సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్దంగా రూపొందించిన మేరకు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు కొనుగోలు అవసరమైన మౌలిక సదుపాయా లను కల్పించడంతో రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా కొనుగోలు పక్రియ ముగిసిందని ఆయన వివరించారు. అందుకు పౌర సరఫరాల శాఖ సిబ్బంది పని తీరును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




ప్రత్యేకంగా అభినందించారు. అధిక దిగుబడులతో పాటు రికార్డ్ స్థాయిలో కొనుగోలు చెసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థకు సరఫరా చేయడంతో పాటు తెలంగాణా బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న డిమాండ్ ను పట్టి విదేశాలకు ఎగుమతి చేసేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకుగాను రైతులను ప్రోత్సహిం చేందుకు ప్రోత్సాహకాల ఆవశ్యకతను ఆయన వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ కు బియ్యాన్ని ఎగుమతి చెసేందుకు కుడా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు పక్రియలో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 38,000 కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం కుడా ఒక అరుదైన రికార్డే అని ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతాంగం పట్ల అనుసరించిన విధానాలతో సంచల నాత్మక ఫలితాలు సాధించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మకమైన మార్పు లకు శ్రీకారం చుట్టిందన్నారు.అర్హులైన నిరుపేదలం దరికీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయ వంతంగా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్నబియ్యం 3.17 కోట్ల మందికి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని,అంటే రాష్ట్ర జనాభాలో 85? లబ్ది పొందుతున్నారని ఆయన వివరించారు.అర్హులైన ప్రతి లబ్దిదారుకు నెలకు ఆరు కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. సన్నబియ్యం పంపిణీ మీద 13,650 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు ఆయన తెలిపారు.

ప్రజాపంపిణీ వ్యవస్థలో ఉన్న నాణ్యతా లోపాలు గుర్తించడంతో పాటు అక్రమంగా బ్లాక్ మార్కెట్ కు తరలి పోయే విధానానికి క్లెళం వేసి నాణ్యతా ప్రమాణాలపై కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చామన్నారు. ధాన్యం కొనుగోళ్ల పక్రియ సీజన్‌కు సీజన్‌కు పెరుగుతున్న నేపద్యంలో అందుకు అను గుణంగా నిల్వ చేసేందుకు మౌలిక సదుపాయాల ఆధునీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ధాన్యాన్ని నిల్వచేసే గోదాముల సామర్ద్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు పరిమితము అయ్యిందని,ఈ గోదాములను భారత ఆహార సంస్థ,రాష్ట్ర గోదాముల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతుందని అయితే నాణ్యతా లోపాలతో నిల్వ ఉంచిన బియ్యం చేడి పోయి రాష్ట్ర ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతుందని ఆయన తెలిపారు.

ప్రభుత్వం సహకారంతో పాటు ప్రైవెట్ సంస్థల భాగస్వామ్యం తో ధాన్యం నిలువ ఉంచే గోదాములను సైలో పద్దతిలో ఆధునికరించేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు.. ఆధునికీకరణతో తేమ శాతం నియంత్రణలో ఉండడంతో పాటు నష్టానివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. అయితే ప్రారంభంలో ఆధునీకరణకు ఖర్చు ఎక్కువే అయినప్పటికీ నిల్వ చేసిన బియ్యం చెడిపోకుండా ఉంటే అది ప్రయోజనం కలిగిస్తుందన్నారు.

బీహార్ వంటి రాష్ట్రాల నుండి వలస వచ్చే కార్మికులపై తెలంగాణా రాష్ట్రంలో రైస్ మిల్లులు ఆధారపడుతున్నాయని,ఇటీవల ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే వలస వచ్చిన కార్మికులు వారి వారి స్వస్థలాలకు వెళ్లిపోవడంతో కొనుగోళ్ల పక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆయన చెప్పారు. అటు వంటి పరిస్థితి తిరిగి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు గాను స్థిరమైన కార్మిక వ్యవస్థ ఏర్పాటు ఆవశ్యకతను ఆయన సూచించారు. అదే విదంగా మిల్లింగ్ రంగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు పాటించిన మిల్లర్లకు సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని తప్పిదాలకు పాల్పడితే మాత్రం చర్యలు కఠినాత్మకంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. రాజకీయ వత్తిళ్లకు లొంగకుండా నిబంధనల అమలులో సిబ్బంది కఠినంగా ఉండాలని ఆయన ఉద్బోధించారు. అదే సమయంలో డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపు ప్రసక్తే లేదని ,పౌర సరఫరాల శాఖ రూపొందించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాల్సిందేనన్నారు. పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి కనుగుణంగా ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్రంలో మిల్లుల పరిశ్రమని ప్రోత్సహించె విదంగా విధివిదానలను త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మరిన్ని నిత్యావసర సరుకుల సరఫరాకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందని ఆయన చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో డ్రైయర్లు ,పాడి క్లినర్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిం దని ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని,అన్ని వేళల ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# నైని కోల్ బ్లాక్ టెండర్లపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం, గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్క టెండర్లు రద్దు చేసిన విషయం తెలిసిందే. అలాగే నైని బొగ్గు గని టెండర్ల నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) కూడా ప్రకటించింది. అయితే.. ఇంతకు ముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈరోజు(గురువారం) సాయంత్రం 5:00 గంటల నుంచి బిడ్లు ప్రారంభం కావాల్సి ఉంది. పాలనాపరమైన కారణాలతో టెండర్లను రద్దు చేస్తున్నట్లు సింగరేణి అధికారులు ప్రకటించారు. ఇదిలావుంటే భారత రాష్ట్ర సమితి హయాంలో సింగరేణి బోర్డు నామమాత్రంగా ఉండేదని, వారి హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి విద్యుత్ వాడుకొని జెన్‌కో, ట్రాన్స్‌కో డబ్బులు ఇవ్వలేదు. టెండర్ల నుంచి కాంట్రాక్టుల వరకూ అన్నీ కేసీఆర్ కుటుంబమే చూసేది. ఆ సంస్థ సీఎస్ఆర్ నిధులు కూడా దుర్వినియోగం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రైవేటు కంపెనీలకు పనులు కట్టబెట్టారు. సింగరేణి బోర్డు సమావేశం వివరాలు కూడా నా దృష్టికి రావు. సింగరేణిపై కేంద్రం అజమాయిషీ ఎప్పుడూ లేదు. నిధులు లేక జిల్లాలకు రూ.1500 కోట్ల డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ఇవ్వలేదు. బీఆర్ఎస్ హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయి. గత పదేళ్లలో రూ.32వేల కోట్లకుపైగా సింగరేణి అప్పులు పెరిగాయి. సింగరేణి కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.47వేల కోట్లు చెల్లించాలి. నిబంధనలకు విరుద్ధంగా సీఎండీని మరో 4 ఏళ్లు అదనంగా కొనసాగించారు. ప్రస్తుతం సింగరేణిలో ఇన్‌ఛార్జి సీఎండీతో కాలం గడుపుతున్నారని కేంద్ర మంత్రి విమర్శించారు.

# సింగరేణిపై కేంద్రానికి ఎలాంటి జోక్యం లేదు

(మొదటి పేజీ తరువాయి)

చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా, ఎన్డీయే ప్రభుత్వంలో అయినా కేంద్రం జోక్యం లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అయినప్పటికీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషించిందని తెలిపారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యా యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

సింగరేణి ఎనిమిది జిల్లాల్లో విస్తరించి, నూరముప్పై ఆరు సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సంస్థగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత లాభాల్లో ఉన్న సంస్థ క్రమంగా నష్టాల బాట పట్టిందని విమర్శిం చారు. సింగరేణిలో రాష్ట్రానికి యాభై ఒకటి శాతం, కేంద్రానికి నలభై తొమ్మిది శాతం వాటా ఉన్నప్పటికీ, పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతోందని తెలిపారు. బోర్డు నిర్ణయాలన్నీ రాష్ట్ర ప్రభుత్వ ఆధిపత్యంలోనే జరుగుతున్నాయని, కేంద్రానికి రోజువారీ టెండర్ల వివరాలు కూడా తెలియజేయడం లేదని చెప్పారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం సింగరేణిపై పూర్తిగా పెత్తనం చెలాయించిందని ఆరోపించారు. టెండర్లు, కాంట్రా క్టులు అన్నీ రాజకీయ జోక్యంతో జరిగాయని, దీనివల్ల సంస్థ ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. సీఎస్ఆర్ నిధులను ఎమ్మెల్యే కార్యా లయాలు, వ్యక్తిగత అవసరాలకు మళ్లించారని, ఫలితంగా సింగరేణి అప్పులు భారీగా పెరిగాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు ముప్పై రెండు వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. గత పన్నెండు సంవత్సరాల్లో సుమారు నలభై ఏడు వేల కోట్ల రూపాయలను కార్మికులకు బకాయిగా ఉంచారని, ఇది కార్మికుల రక్తం చెమటల ఫలమని అన్నారు. మైనింగ్ ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాల్సిన డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నిధులు కూడా జిల్లాలకు అందలేదని విమర్శించారు. నూతన సాంకేతికత ప్రవేశపెట్టలేక పాత యంత్రాలతోనే పని చేయాల్సి వస్తోందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

నైని, తాడిచెర్ల కోల్ బ్లాకుల విషయంలో కూడా సింగరేణిని పక్కన పెట్టి ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కోల్ బ్లాకుల కేటాయింపులు పారదర్శక వేలం ద్వారానే జరుగుతున్నాయని, రెండువేల పదిహేనవ సంవత్సరం నుంచి ఒక్క తప్పిదం కూడా జరగలేదన్నారు. మోదీ నాయకత్వంలో దేశంలో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, విద్యుత్ కొరత లేని భారతదేశం రూపుదిద్దుకుంటోందని తెలిపారు. సింగరేణి ఏ కుటుంబానికి చెందిన ఆస్తి కాదని, ఇది కార్మికుల సొత్తు అని కేంద్రమంత్రి హెచ్చరించారు. కార్మికుల జీవితాలతో ఆటలాడితే చరిత్ర క్షమించదని అన్నారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని, కేంద్ర ప్రభుత్వం సంస్థ భవిష్యత్తు, కార్మికుల సంక్షేమం కోసం పూర్తిగా కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎకనమిక్ ఫోరమ్ ఎండి జెరెమీతో సీఎం రేవంత్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్ర మాలను వివరించారు. స్కిల్ డెవలప్మెంట్, స్పోర్ట్స్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఏషియా 2024లో ప్రారంభించిన తెలంగాణ సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ పురోగతిపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ భారత్లో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ అదేనని గుర్తు చేశారు. ఆదర్శవంతమైన మోడల్గా గుర్తింపు సాధించి ందన్నారు. పరిశ్రమల అభివృద్ధి ప్రణాళికలో ఉత్తమ పద్ధతులపై అ4ఐఖీ చేస్తున్న పరిశోధనల సమా చారాన్ని తెలంగాణ ప్రభుత్వంతో పంచుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు జోన్ల నమూనాను విశ్లేషించారు. ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటును వివరించారు. ఇది నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్కు ఉన్న అనుకూలతలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.

# అడకత్తెరలో ఆ 10 మంది!

(మొదటి పేజీ తరువాయి)

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ న్యాయపోరాటం ప్రారంభించింది. కేసు సుప్రీంకోర్టు దాకా వెళ్లడంతో దీనిపై ఏదో ఒకటి తేల్చాల్సిన తప్పనిసరి పరిస్థితి స్పీకర్ పై పడింది. జాప్యం చేస్తున్నారన్న కారణాలతో స్పీకర్ కూడా కోర్టు నోటీసులు అందుకోవాల్సివచ్చింది. దీంతో వారంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలేనంటూ స్పీకర్ తీర్పులు ఇవ్వడం మొదలుపెట్టారు. ఇప్పటివరకు ఎనిమిది మంది ఎమ్మెల్యలేపై విచారణ పూర్తికాగా, మరో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహారం పెండింగ్ లో ఉంది.

### స్థానిక నేతలతో విభేదాలు తారస్థాయికి..

ఇప్పటికే మెడపై అనర్హత కత్తి వేలాడుతుండడంతో ఆందోళనలో ఉన్న ఫిరాయింపు ఎమ్మెల్యేలకు.. స్థానిక కాంగ్రెస్ నేతలతో విభేదాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఎమ్మెల్యేల నీడను కూడా సహించలేని స్థితికి అక్కడి నేతలు వచ్చారు. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి విషయంలో ఇదే జరిగింది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశానికి ఎమ్మెల్యే సంజయ్ ని పార్టీ నాయకత్వం పిలవడంతో ఆయన హాజరయ్యారు. కానీ, దీనిని సహించలేని జీవన్ రెడ్డి తీవ్ర నిరసన తెలిపారు. సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. మరోవైపు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. స్థానిక కాంగ్రెస్ నేతలతో పొసగక తాను కాంగ్రెస్ లో చేరి తప్పు చేశానని బహిరంగంగానే అన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇలాంటి పరిస్థితులే దాదాపు 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలకూ ఎదురవుతున్నాయి. దీంతో తాము ఎటూ కాకుండా పోయామన్న వేదనలో వారు ఉన్నారు. నైతికంగా ఇది తమ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు.

# సోషల్ మీడియాకు పిల్లలను దూరం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

దావోస్‌లో బ్లూమ్‌బర్గ్‌తో లోకేశ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఒక నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్న యువకులు అలాంటి ప్లాట్‌ఫామ్‌లలో ఉండకూడదు. ఎందుకంటే వారు బహిర్గతం చేసే కంటెంట్‌ను పూర్తిగా అర్థం చేసుకోలేరు. అందువల్ల, బలమైన, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అవ సరం కావచ్చు. ఆ దిశగా మేం ఆలోచిస్తున్నాం' అని లోకేశ్ వెల్లడించారు. దావోస్ పర్యటనలోనే ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నారా లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టారు. రెండు రాష్ట్రాల్లోని విద్యా సంస్కరణలు, ఐటీ అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధిపై నిర్మాణాత్మక చర్చలు జరిపాం. పరస్పర సహాయ సహకారాలతో దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు అత్యంత వేగంగా వృద్ధి చెందుతాయని విశ్వసిస్తున్నా. వేర్వేరు రాష్ట్రాలుగా పెట్టుబడుల కోసం పోటీ పడినా.. కలిసి కట్టుగా దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం అని లోకేశ్ తెలిపారు.

### బిఆర్ఎస్ నేత కెటిఆర్‌కు

# సిట్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 11:00 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో విచారణకు హాజరవ్వాలంటూ కేటీఆర్‌కు నోటీసులిచ్చారు. సీఆర్‌పీసీ 160 కింద నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఈ నోటీసులను సిట్ అధికారులు అందజేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సిట్ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించనున్నారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రమేయం ఉన్న పోలీస్ ఉన్నతాధికారుల్లో కొందరు ఇప్పటికే అరెస్ట్ అవగా.. ఇప్పుడు నాయకుల విచారణ జరుగుతోంది.

ఈ కేసులో ఇటీవలే మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసిన సిట్ అధికారులు.. ఆయన్ను కూడా ఇటీవల విచారించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన్ను పలు అంశాలపై విచారించిన అధికారులు.. కీలక సమాచారం రాబట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడంపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. 'నిన్న నాకు నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు కేటీఆర్‌కు ఇచ్చారు. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పే దమ్ములేదు. రేవంత్ రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసేదాకా వదలబోము. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా.. రేవంత్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఆయన వెంటపడుతూనే ఉంటాం' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# 27న బ్యాంక్ ఉద్యోగ సంఘాల సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

కన్వీనర్ ఆంజనేయ ప్రసాద్ మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ ఇండియా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ), జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్(జిఐసి) వంటి సంస్థలలో కొనసాగుతున్న విధంగా తమకు 5 రోజులను అమలు చేయాలని గత 15 ఏళ్లుగా పోరాడుతున్నట్లు చెప్పారు. ఇందుకుగాను ప్రతి రోజు 42 నిమిషాలు అధికంగా పనిచేస్తామని చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు అసహనం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ సెక్టాంలో పనిచేస్తున్న వారు సామాజిక జీవితానికి దూరం అవుతున్నందున ఈ విధానాన్ని అమలు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఐదు రోజుల పని దినాలను తప్పనిసరిగా అమలు చేయాలని గత ఏడాది మార్చి 24, 25 తేదీలలో రెండు రోజుల సమ్మెకు పిలుపునివ్వడంతో అమలు చేస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆంజనేయ ప్రసాద్ గుర్తు చేశారు. 9 నెలలుగా ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ఖాతాదారులు సైతం తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించుకునేందుకు జరుగుతున్న సమ్మెకు మద్దతు పలకాలని ఆంజనేయ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.2024 మార్చిలో వేతన సవరణ సెటిల్‌మెంట్ సమయంలో మిగతా రెండు శనివారాలు కూడా సెలవు ఇచ్చేందుకు ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబీఏ), యూఎఫ్‌బీయూ మధ్య అంగీకారం కుదిరింది.

తాజాగా ప్రకటించిన ఈ సమ్మె కార్యరూపం దాలిస్తే.. ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలపై వరుసగా మూడు రోజుల పాటు ప్రభావం పడనుంది. జనవరి 25, 26 తేదీల్లో బ్యాంకులకు సెలవులు. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులు ఆదివారాలతో పాటు రెండవ, నాలుగో శనివారాలు సెలవు పొందుతున్నారు.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
తెలంగాణ రౌండప్

# గడ్డివాము దగ్ధం



**ఆమనగల్లు, జనవరి 22 (అక్షర గళం):** ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చోటుచేసుకుంది. విఠయిపల్లికి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పర్వతాలు తన వ్యవసాయ పొలంలోని దొడ్డిలో పశువుల కోసం గడ్డిని నిల్వచేశాడు. గురువారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు గడ్డి వాములకు మంటలు అంటుకున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు పర్వతాలు కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్థుల సహకారంతో మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.30వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

# అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్దాం..

- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలి
- రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్

**ఆమనగల్లు, జనవరి 22 (అక్షర గళం):** కాంగ్రెస్ హయాంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తే మరో పార్టీకి భవిష్యత్తే ఉండదని రాజ్యసభ సభ్యులు మందడి అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. అయితే, చేసిన అభివృద్ధి పనులను చెప్పుకోవడంలో కాంగ్రెస్ శ్రేణులు వెనుకబడగా.. మిగతా పార్టీలు కొద్దిపాటి పనులనే ప్రచారం చేసుకుంటున్నాయని చెప్పారు. ఇకనైనా అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు చేయాలని సూచించారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటకు వెళ్తున్న తరుణంలో ఆమనగల్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ పథకాలు ఈ విషయాన్ని ప్రతీ నాయకుడు రోజుకు కనీసం



పది మందికి వివరించాలని.. తద్వారా మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, సర్పంచ్లు మండ్లి రాములు, కర్ణాకర్ గౌడ్, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, సీనియర్ నాయకులు చెన్నారెడ్డి, శ్రీరాములు, ఖాదర్ ఖాద్రి, కాలే మల్లయ్య, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంగలి ప్రసాద్, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ అలీమ్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, వగ్గు మహేష్, రాగ్య నాయక్, కరీం, నాజర్, రహీం, శ్రీను నాయక్, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, రూపం వెంకట్ రెడ్డి, ప్రశాంత్, గోపాల్ నాయక్, అంజాత్, రమేష్, కొప్పు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

**- మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్**

**ఆమనగల్లు, జనవరి 22 (అక్షర గళం):** ఆమనగల్లు మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ ఉత్పత్తులను స్టాళ్లలో ప్రదర్శించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయానికి సంబంధించిన నమూనాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు, గ్రామీణ యువత మృత్తికా శాస్త్రవేత్త లను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

## నేడు ఊరుకొండ మండలంలో మహబూబ్నగర్ ఎంపీ డీకే.అరుణ పర్యటన

**మండల పార్టీ అధ్యక్షుడు కె.రాజేందర్ గౌడ్**



**కల్వకుర్తి, జనవరి 22(అక్షరగళం):** నాగర్కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల పరిధిలోని మాదారం గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం కార్యక్రమానికి మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే.అరుణ ప్రారంభిస్తారని ఊరుకొండ మండల పార్టీ అధ్యక్షుడు కే.రాజేందర్ గౌడ్ మీడియాకు తెలిపారు.

ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డితో పాటు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. మండల పరిధిలోని శక్తి కేంద్ర ఇన్చార్జిలు బూత్ అధ్యక్షులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో కార్యక్రమానికి తరలివచ్చి దిగ్విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సొంతింటి నిర్మాణం కోసం చేయూతనిచ్చిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

**కల్వకుర్తి, జనవరి 22(అక్షరగళం):** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని గుబ్బ నరేందర్ సొంతింటి నిర్మాణం కోసం స్టీల్ సిమెంట్ను గురువారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ




మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అందజేసి సొంతింటి కళకు చేయూతనందించారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణానికి సహకారం అందించి లక్షల విలువైన సామాగ్రిని అందజేసి ఉప్పల వెంకటేష్ కు రుణపడి ఉంటామని గుబ్బ నరేందర్ అన్నారు.

## నేడు కల్వకుర్తి రెవెన్యూ డివిజన్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి పర్యటన



**కల్వకుర్తి, జనవరి 22(అక్షరగళం):** రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఊర్కొండ వెల్దండలో పర్యటిస్తారని గురువారం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మీడియాకు తెలిపారు. ఊరుకొండ మండల పరిధిలోని ఊరుకొండ పేట్ శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరై స్వామి వారిని 12 గంటలకు దర్శించుకుంటారని అనంతరం వెల్దండ మండల పరిధిలోని బహిరాపూర్ గ్రామంలో నిర్వహించే సైదులు దేవుని దర్గా గందోత్సవంలో 2:30 గంటలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు హాజరుకావాలని కోరారు

## యువత స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి

**- మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్**

**ఆమనగల్లు, జనవరి 22 (అక్షర గళం):** యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని మాజీ జడ్పీటీసీ, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ సూచించారు. కడ్తాల్ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏ.ఎన్ గ్రాండ్ హోటల్ ను ముఖ్యఅతిథిగా హాజరై



ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత స్వయం కృషితో ఎదగడం ఎంతో గొప్ప విషయమని కడ్తాల్ స్థానికులకు నాణ్యమైన భోజనాన్ని కుటుంబ వాతావరణంలో అందించాలనే ఏ.ఎన్ గ్రాండ్ హోటల్ యజమాని నరేష్ గ్రాండ్ హోటల్ పెట్టడం జరిగిందని తెలిపారు. తెలుగు సాంప్రదాయ వంటకాల ఘనతను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో హోటల్ యజమానులు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. ఏ.ఎన్. గ్రాండ్ హోటల్ ప్రత్యేక వంటకాలు రాయలసీమ కారం ఆంధ్ర వంటకాల పులుపు తెలంగాణ గ్రామీణ రుచుల సమేతంగా ఇక్కడి వంటకాలు ప్రత్యేకమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సేవ్య బావోజీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ నాయకులు ఆసిఫ్ అలీ, కోటయ్య, పాండు, నాగార్జున, రాజు, గణేష్,శంకర్, శీను, అమర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి

**- జడ్జి కాటం స్వరూప**

**ఆమనగల్లు, జనవరి 22 (అక్షర గళం):** అనునిత్యం న్యాయమూర్తులు, న్యాయవాదులకు వృత్తి పరంగా ఎదురయ్యే ఒత్తిడిల నుంచి క్రీడలు ఉపశమనం కలిగిస్తాయని, మానసిక ఉల్లాసాన్ని కలిగించి మరింత ఉత్సాహంగా పనిచేసే శక్తిని అందిస్తాయని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొనిబార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలో భాగంగా గురువారం ఆమె క్రీడా పోటీలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి కాటం స్వరూప మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు.



తప్పనిసరిగా ఏదో ఒక క్రీడలో భాగస్వాములు కావాలన్నారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శి దుద్దు ఆంజనేయులు, ఉపాధ్య క్షులు ఏర్పుల రామకృష్ణ, కోశాధికారి కొప్పు కృష్ణ, గ్రంథాలయ సెక్రటరీ వస్పుల మల్లేష్, క్రీడా కార్యదర్శి ఏ శేఖర్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, కృష్ణయ్య న్యాయవాదులు గణేష్ గౌడ్, సంతోష్, మల్లేష్, మధు గౌడ్, జగన్ గౌడ్, శివ, శ్రీనివాస్, శ్రీశైలం కోర్టు సూపరింటెండెంట్ మురలీకృష్ణ తదితరులు ఉన్నారు.



## గ్రామాల అభివృద్ధికి సర్పంచులు పాటుపడాలి

**- ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి**

**ఆమనగల్లు, జనవరి 22 (అక్షర గళం):** సర్పంచులు రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామ సర్పంచ్ జంగమ్మ వెంకటయ్య, ఉప సర్పంచ్ బాలాగోని కృష్ణ ప్రసాద్ గురువారం హైద్రాబాద్ లోని గోలీ శ్రీనివాస్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం అలివేలుమంగా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా గోలీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో బ్రహ్మోత్సవాలు జరుపుకోవాలని సూచించారు. సర్పంచ్ లు రాజకీయ పార్టీలకు బందీలుగా కాకుండా ప్రజలకు నాయకుడిగా ఉండి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. దేశంలో రాష్ట్రపతి, ప్రధానమంత్రికి లేని చెక్ పవర్ కేవలం సర్పంచ్ కు మాత్రమే ఉందని తెలిపారు. సర్పంచ్ డైరెక్టుగా సంతకం పెట్టి నిధులను గ్రామ అభివృద్ధికి ఉపయోగించుకోవచ్చని అన్నారు. గ్రామాలను బాగు చేసే అదృష్టం ప్రజలు కల్పించారని, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే వివిధ అభివృద్ధి పథకాల నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, పర్వతాలు, సాయి, రవి తదితరులు ఉన్నారు.

## ఆర్థిక సహాయం అందించిన ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు

**ఆమనగల్లు, జనవరి 22 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠయిపల్లి కి చెందిన పూజ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు గురువారం మృతుడు పూజ ఇంటికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అతడి భార్య సీమా కు ట్రాక్టర్ అసోసియేషన్ తరుపున రూ. 8000 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో రమేష్ నాయక్, మల్లయ్య, నరేష్, నరసింహారెడ్డి, నరేష్, నాగరాజు, కంబాలపల్లి సాలయ్య తదితరులు ఉన్నారు.



## మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం వాట్సాప్ సేవలు

**అక్షర గళం, మేడారం:** మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా భక్తులు 76589 12300 నంబర్కు 'హాయ్ ' అని మెసేజ్ పంపితే జాతరకు సంబంధించిన పూర్తి వివరాలు పొందవచ్చునని తెలిపారు. జాతర రూట్ మ్యాప్, ట్రాఫిక్ అప్డేట్స్, పార్కింగ్, వైద్య కేంద్రాలు, స్నానఘట్టాలు తదితర సమాచారం నేరుగా వాట్సాప్లో లభించనుంది. ఈ సేవలతో భక్తులకు మరింత సౌకర్యం కలగనుంది

## కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్కు 1,040 క్వింటాల్ల వేరుశనగ

**కల్వకుర్తి, జనవరి 22(అక్షరగళం):** కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కు గురువారం మార్కెట్ కావడంతో రైతులు 1040.60 క్వింటాళ్ల వేరుశనగను తీసుకొచ్చారు. వేరుశనగ మద్దతు ధర మొదటి రకం 9863 రూపాయలు పలకగా తక్కువ ధర 7501.99 పైసలు మోడల్ ధర 9709 ధరను





వ్యాపారస్తులు నిర్ణయించారు.

అదేవిధంగా కందులు 10.50 క్వింటాళ్లు తీసుకురాగా గరిష్ట ధర 6809 కరిష్ట ధర 6268 మోడల్ ధర 6709 రూపాయలు పలికినట్లు వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ తెలిపారు మార్కెట్ యార్డుకు మొత్తం 113 మంది రైతులు రాగా మొత్తం బస్తాల సంఖ్య 3458కాగా మొత్తం క్వింటాళ్లు 1040 వేరుశనగ రాగా కందుల అమ్మడానికి 4 రైతులు రాగ మొత్తం 21 బస్తాలు కందులు వచ్చినట్లు మార్కెట్ సెక్రటరీ తెలిపారు.

# ఆర్గానిక్ మాయ

**నగరవాసి ఆరోగ్య భయమే వ్యాపార పెట్టుబడి.. సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్న 'సేంద్రియ' దందా!**

## ఆరోగ్య సంరక్షణ ముసుగులో మార్కెట్ మాయాజాలం!

**ఆధునిక నగర జీవనంలో 'ఆర్గానిక్' అన్నది ఒక అవసరంగా కాక, భయం నుంచి పుట్టిన ఖరీదైన ఆశగా మారింది. కలుషిత ఆహారం, మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న వ్యాధుల భయంతో సగటు వినియోగదారుడు సేంద్రియ మార్గంలో భరోసాను వెతుక్కుంటున్నాడు. అయితే పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఆర్గానిక్ స్టోర్లు నిజంగా ఆరోగ్యాన్ని పంచుతున్నాయా? లేక మార్కెట్‌ను పెంచుతున్నాయా? ఇది నేటి మిలియన్ డాలర్ల ప్రశ్న..**



### వెలుగుల వెనుక చీకటి

భారతదేశంలో సేంద్రియ మార్కెట్ విలువ ఏటా వేల కోట్లకు విస్తరిస్తోంది. కానీ మార్కెట్ వేగానికి క్షేత్రస్థాయి ఉత్పత్తికి పొంతన ఉండటం లేదు. దేశవ్యాప్తంగా సేంద్రియ సాగు కింద ఉన్న భూమి 3 శాతం కూడా లేదు. ఉత్పత్తి ఇంత పరిమితంగా ఉన్నప్పుడు, నగరాల నిండా కనిపిస్తున్న భారీ 'ఆర్గానిక్' ప్రవాహం ఎక్కడి నుంచి వస్తోంది? భూమి విస్తీర్ణం పెరగకుండానే, ప్యాకెట్లపై 'ఆర్గానిక్' ముద్రలు ఎలా పెరుగుతున్నాయి? ఇది ప్రకృతి ప్రసాదమా? లేక బ్రాండింగ్ మాయాజాలమా?

### మార్కెట్ మాయలో వినియోగదారుడు

ఈ విరుద్ధ పరిస్థితి అనేక అనుమానాలకు తావిస్తోంది:

**కల్తీ ముప్పు:** సేంద్రియ ముసుగులో సాధారణ రసాయన పంటలే మార్కెట్లోకి వస్తున్నాయా? 'ఆర్గానిక్' అన్న పదమే భరోసాగా మారి, వాస్తవ తనిఖీకి అవకాశం లేకుండా పోతోంది.

**ధరల భారం:** సాధారణ ఉత్పత్తుల కంటే 50 నుండి 200 శాతం అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఈ అదనపు ఖర్చు నాణ్యత కోసమా లేక కేవలం 'నమ్మకం' మీద పెట్టిన ధరనా?

**సర్టిఫికేషన్ లోపాలు:** పి జి ఎస్, న్ పి ఓ పి వంటి ధ్రువీకరణ వ్యవస్థల్లోని లొసుగులను వాడుకుని, కాగితాలపైనే ఉత్పత్తులను 'ఆర్గానిక్'గా మారుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### ఆకర్షణీయమైన ప్యాకేజింగ్ - మోసానికి ముసుగు

పచ్చని లోగోలు, సహజ సిద్ధమైన చిత్రాలు సేంద్రియానికి నిజమైన సాక్ష్యాలు కావు. "ఎక్కువ ధర ఉంటేనే అసలైన ఆర్గానిక్" అనే అపోహను మార్కెటింగ్ శక్తులు ప్రజల్లో నాటాయి. కానీ ధరకూ నాణ్యతకూ సంబంధం లేదు. పారదర్శకమైన పరీక్షా వ్యవస్థలు అందుబాటులో లేకపోవడంతో, వినియోగదారుడు ఏది నిజమో తెలియక అధిక ధర చెల్లించి మోసపోతున్నాడు.

### నలిగిపోతున్న రైతు - లాభపడుతున్న దళారి

ఈ 'సేంద్రియ విప్లవం'లో అసలు లాభపడాల్సిన రైతు అట్టడుగునే ఉన్నాడు. ప్రకృతి పద్ధతుల్లో శ్రమించి పండించిన రైతుకు సరైన ధర దక్కడం లేదు. కార్పొరేట్ సంస్థలు తక్కువ ధరకు సేకరించి, బ్రాండింగ్ పేరుతో ధరను రెట్టింపు చేస్తున్నాయి. వినియోగదారుడు చెల్లించే అదనపు సొమ్ము రైతుకు కాక మధ్యవర్తుల జేబుల్లోకి చేరుతోంది..

### ప్రభుత్వాల బాధ్యత: ప్రేక్షక పాత్ర వీడాలి

ప్రజారోగ్యం అనేది మార్కెట్‌కు అప్పగించాల్సిన విషయం కాదు, అది పాలన యొక్క ప్రాథమిక బాధ్యత.

కఠిన తనిఖీలు భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల సంస్థ కేవలం రసాయన అవశేషాల పరీక్షలకే పరిమితం కాకుండా, ఆర్గానిక్ స్టోర్ల సరఫరా గొలుసును పారదర్శకంగా పరిశీలించాలి. నకిలీ క్లెయిమ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలి.


**ప్రత్యేక మార్కెట్లు:** ప్రభుత్వం నేరుగా 'ఆర్గానిక్ రైతు బజార్లు' ఏర్పాటు చేయాలి. ఇది రైతుకు న్యాయమైన ధరను, వినియోగదారుడికి నమ్మకాన్ని ఇస్తుంది.

**ప్రోత్సాహకాలు:** రసాయన వ్యవసాయానికి ఇచ్చే సబ్సిడీలను సేంద్రియ సాగుకు కూడా వర్తింపజేయాలి. అప్పుడే ఉత్పత్తి వ్యయం తగ్గి, సామాన్యుడికి సేంద్రియ ఆహారం అందుబాటులోకి వస్తుంది.

### వినియోగదారుడే మారాలి

మార్పు కింది స్థాయి నుంచే మొదలవ్వాలి. లేబుళ్లను కళ్లు మూసుకుని నమ్మకుండా, ఉత్పత్తి మూలాలను ప్రశ్నించే ధైర్యం వినియోగదారుడికి రావాలి. స్థానిక రైతులతో నేరుగా సంబంధాలు పెంచుకోవాలి. 'పొలం నుంచి పళ్లెంలోకి' అనే సంస్కృతి బలపడాలి..

ఆర్గానిక్ ఆహారం ఒక బ్రాండెడ్ వ్యాపారంగా కాకుండా, సామాజిక బాధ్యతగా మారాలి. ఇప్పుడే అడ్డుకట్ట వేయకపోతే, 'ఆర్గానిక్' కూడా నమ్మకం కోల్పోయిన మరో మార్కెటింగ్ జిమ్మిక్కుగా మిగిలిపోతుంది. నిజమైన సేంద్రియ దారిలోనే రైతుకు గౌరవం, భూమికి రక్షణ, సామాన్యుడికి ఆరోగ్యం లభిస్తాయి.



**- జి.అజయ్ కుమార్**
**వ్యవసాయ నిపుణులు**

---

# డిజిపి శివధర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, జితేందర్‌ను సిట్ పిలవదేం?

- టిఆర్ఎస్ ప్రభుత్వంలో మొదటి ఇంటెలిజెన్స్ ఐజీ ఎవరు?
- శివధర్ రెడ్డికి తెలుస్తది ఎవరి ఫోన్లు ట్యాప్ చేశారో... మాకేం తెలుస్తది?
- ఆ రోజు మా ఐజీ ఇంటెలిజెన్స్... ఆయనకు తెలవకుండానే జరిగిందా?
- ఓన్లీ పొలిటికల్ లీడర్లని ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?
- రేవంత్ బామ్మర్ది అమృత్ స్కామ్‌పై సిట్ వేయండి
- ఆర్ఆర్ టాక్స్ అంటారు.. దాని మీద సిట్ ఉండదు
- అది సిట్ కాదు పిట్ కాదు.. ఒక డెయిలీ సీరియల్
- రేవంత్.. ఈ హౌల పనులు బంద్ చేయమని చెప్తున్నా
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు, తనకు సిట్ నోటీసులపై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**సిరిసిల్ల:** ప్రభుత్వం వేసిన సిట్ అంటే రేవంత్ రెడ్డి సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్. అది సిట్ కాదు పిట్ కాదు. అది ఒక డెయిలీ సీరియల్. రేవంత్ రెడ్డి కి పాపం పరిపాలన రాదు. చేతగాదు. అసమర్థుడు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకునే తెలివి లేదు. 420 హామీలు ఇచ్చి అడ్డగోలు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు.

తప్పించుకోవాలంటే ఏం చేయాలి? అమలు చేయకుండా ఆరు గ్యారంటీలు, 420 హామీలు... ఏదో ఒక రూపంలో అటెన్షన్ డైవర్షన్ గేమ్స్ ఆడాలి. అందులో భాగంగా కొన్ని రోజులు కాళేశ్వరం కుంభకోణం అని కొన్ని రోజులు డ్రామా. తర్వాత ఫోన్ ట్యాపింగ్ అని కొన్ని రోజులు డ్రామా. అట్లనే కొన్ని రోజులు గొర్రెల స్కామ్ అని డ్రామా. కొన్ని రోజులు ఫార్ములా-ఇ అని కొన్ని రోజులు డ్రామా. ఈ రెండేళ్లు ఈ డ్రామాలు తప్ప రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాధించింది, ప్రజలకి ఇచ్చింది ఏమి లేదు

మొన్న హరీష్ రావు వారి బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినారు. రేవంత్ రెడ్డి బావమరిది ఆధ్వర్యంలో ఎట్లా సింగరేణిలో బొగ్గు కుంభకోణాలు జరుగుతున్నాయి? వేల కోట్ల కాంట్రాక్టులు అటు రేవంత్ రెడ్డి ఇటు కేంద్ర ప్రభుత్వంలో ఉన్న పెద్దలు మంచిగా అదులుకొని బదులుకొని ఇద్దరు కాంగ్రెస్ - బిజెపి వాళ్లు వారు చక్కగా దోపిడీ చేస్తున్నారో బయటపెడితే... సాయంత్రం కల్లా సిట్ నోటీసు ఇచ్చారు.

ఇవాళ సిట్ వేయాల్సింది పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, వారి కొడుకు గుండాలను తీసుకొని పోయి భూములు కబ్జా చేస్తా ఉన్నాడు. వారి మీద సిట్ వేయండి. ఇవాళ రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి, డైరెక్ట్ గా బొగ్గు కుంభకోణాలు చేస్తున్నాడని ఆధారాలతో చూపెడితే వారి మీద సిట్ ఉండదు. ఏ విచారణ ఉండదు.

కిషన్ రెడ్డి మాట్లాడితే ఆశ్చర్యం అనిపించింది. రాష్ట్ర ప్రభుత్వం కంప్లైంట్ చేస్తే కేంద్రం సిబిఐ విచారణకు ఆదేశిస్తుందని, పట్టపగలే దోపిడీ చేసిన దొంగ 'నేను దొంగతనం చేసినాను' అని ఎవరైనా చెబుతాడా పోలీస్ స్టేషన్ లో? దొంగ అని చెప్పి మేము ఆధారాలతో సహా చూపెడుతుంటే, కాదు కాదు కాదు దొంగనే ఫిర్యాదు చేయాలి. చేస్తే మేము విచారణకు ఆదేశిస్తాం... ఎంత అసహ్యంగా, ఎంత ఎబ్బెట్టుగా ఇవాళ కేంద్ర ప్రభుత్వ వైఖరి ఉంది.

అమృత్ స్కామ్‌లో సృజన్ రెడ్డి కంపెనీకి అర్హత లేకపోయినా , కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ లో వీళ్ళ బావమరిది, రేవంత్ రెడ్డి బావమరిది ఇవాళ కాంట్రాక్టులు ఏవైతే దక్కించుకున్నారో, ఆధారాలతో సహా నేను ఢిల్లీకి పోయి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి ఇచ్చినాను. దాని మీద సిట్ వేయండి

సుప్రీం కోర్ట్ ఎంపవర్డ్ కమిటీ గచ్చిబౌలి భూముల్లో 10 వేల కోట్ల కుంభకోణం జరిగింది. దీని మీద ఒక స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ వేయమని సుప్రీం కోర్ట్ అపాయింట్ చేసిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ, కేంద్ర ప్రభుత్వానికి రికమెండ్ చేసింది. ఎందుకు కేంద్ర ప్రభుత్వం స్పందించట్లేదు? ఎందుకు రేవంత్ రెడ్డిని కాపాడుతున్నది? ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలంగాణకు వచ్చిన ప్రతిసారి చెప్తారు ఇక్కడ 'ఆర్ఆర్ టాక్స్' అమలవుతుంది అంటారు. మరి ఆర్ఆర్ టాక్స్ అమలవుతుందని మీరు చెప్పి సంవత్సరంన్నర అయిపోయింది.



రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ దోపిడీ చేస్తున్నారని మీరే చెబుతూ, మీ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గారు తెలంగాణ ఏటీఎం గా మారిపోయింది కాంగ్రెస్ కు అని స్టేట్మెంట్ ఇస్తారు. దాని పైన సిట్ మాత్రం ఉండదు. ఆర్ఆర్ టాక్స్ అంటారు దాని మీద సిట్ ఉండదు, దాని మీద విచారణ ఉండదు. బొగ్గు కుంభకోణం జరిగిందయ్యా అని ఆధారాలు ఇస్తే దాని మీద సిట్ ఉండదు

మమ్మల్ని మాత్రం పిలుస్తున్నారు. తప్పకుండా మేము ఏ తప్పు చేయలేదు కాబట్టి, మేము ఏ రకంగా కూడా ఎవరికీ నష్టం చేయలేదు కాబట్టి ముమ్మాటికీ పోతాం.

మా ఎమ్మెల్యేలను కొంటూ 50 లక్షల రూపాయలతో ఒక సన్నాసి దొరికిండు 2015లో. ఒక సన్నాసి మా ఎమ్మెల్యేలను కొంటూ 50 లక్షల రూపాయలు పట్టుకొని, బ్యాగ్ లో మా ప్రభుత్వాన్ని కూల్చాలనే కుట్ర చేస్తూ దొరికిండు. మరి ప్రభుత్వాన్ని కూలగొట్టే కుట్రలు ఎవరైనా చేస్తే,వాళ్ళ ఫోన్లు పోలీసులు ఏమో విన్నారేమో నాకేం తెలుసు? అట్లనే ఇంకెవరైనా అట్లాంటి పనులు చేసింగ్రేమో పోలీసులు విన్నారేమో మంత్రులకు ఏం తెలుస్తది? ప్రభుత్వంలో ఉన్న వాళ్ళకి ఏం తెలుస్తది?

కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఉత్తమ్ కుమార్ రెడ్డి వారి ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి అని చెప్పి జర్నలిస్టులకు చెప్తే, జర్నలిస్టులు దాని మీద వార్తలు రాస్తే, ఇంతవరకు ప్రభుత్వం ఖండించలేదు. నేను అడుగుతా ఉన్నా రాష్ట్ర డిజిపి , రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఐజీ ని... మీరు ప్రమాణం చేసి చెప్పగలుగుతారా రాష్ట్రంలో ప్రస్తుతం మీరు ఫోన్లు మావి ట్యాప్ చేయట్లేదు, మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయట్లేదని?

ఫోన్ ట్యాపింగ్ అనేది, గూఢచారి వ్యవస్థ అనేది పోలీసులు ఈరోజు కాదు. నిఘా వ్యవస్థ అనేది శాంతిభద్రతల పరిరక్షణ కోసం. అట్లనే ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్రలు ఎవరైనా చేస్తే, దాని నుంచి ప్రభుత్వాలను కాపాడడం కోసం 1952 నుంచి నెహ్రూ టైం నుంచి ఈరోజు మోడీ అనిపించింది టైం వరకు ఉన్నది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి ఆయన ఆధీనంలో ఉండే పోలీసులు కూడా, ఇవాళ దేశంలో కొన్ని వేల ఫోన్లు వింటున్నారు. అది ఆయనకు తెలుసో తెలియదో నాకు తెలవదు. ఇది దేశ భద్రతకు, శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రభుత్వాల స్థిరత్వానికి సంబంధించి పోలీసులు రొటీన్ గా శాంతిభద్రతలు కాపాడాలి అనుకున్నప్పుడు జరిగే కార్యక్రమం. దానికి మంత్రులకు, ప్రభుత్వంలో ఉండే రాజకీయ నాయకులకు పాత్ర ఉండదు. ఇదే రేపు చెప్తా. నేను ఏం చెప్తా ఇంకా కొత్తగా? మాకేం సంబంధం? మాకేం తెలుసు?

ప్రతి ప్రభుత్వం ఈ దేశంలో గూఢచారి వ్యవస్థ మీద ఆధారపడతది. ప్రభుత్వాధినేతలకు రిపోర్టులు వస్తాయి. ఎట్లా వస్తాయో మాకు తెలవదు. వాళ్ళు ఎట్లా తీసుకువచ్చినారో సమాచారం మాకు తెలవదు. మేము అడగం. మేమంటే మేము కాదు ముఖ్యమంత్రులకు. మంత్రులకు అయితే అసలే తెలవదు. ఇది వాస్తవం. సిట్ ఎవరిని పిలవాలి నిజానికి గతంలో ఇంటెలిజెన్స్ ఐజీగా పని చేసి ప్రస్తుతం డిజిపిగా ఉన్న శివధర్ రెడ్డిని పిలిచినరా? గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వంలో మొదటి ఇంటెలిజెన్స్ ఐజీ ఎవరు? ఇవాళ డిజిపి శివధర్ రెడ్డి . ఆయనకు తెలుస్తది ఎవరి ఫోన్లు ట్యాప్ చేశారో. మాకేం తెలుస్తది? గతంలో డిజిపిగా పని చేసిన మహేందర్ రెడ్డి కి తెలుస్తది. మొన్నటిదాకా డిజిపిగా పని చేసిన జితేందర్ , ఆయన గతంలో హోం సెక్రటరీ ఉన్నారు ఆయనకు తెలుస్తది.

ఎవరిని పిలవాలో వాళ్ళని పిలవకుండా, ఇందులో ఏదో మాకేదో రాజకీయ నాయకులకు సంబంధం ఉన్నట్టు కార్తీక దీపం సీరియల్ లాగా ఒడవని అంతులేని కథ లాగా కేవలం టైం పాస్ కోసం చేస్తున్నారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ఇవాళ రేవంత్ రెడ్డి ట్యాప్ చేయడం లేదని, ఒక్క అధికారి కెమెరా ముందుకు వచ్చి చెప్పే ధైర్యం ఉందా? చెప్తారా అఫీషియల్ గా? వాళ్ళకు తెలుసు చెప్పలేరు. ఎందుకు? రేపు మా గవర్నమెంట్ వస్తది. మళ్ళా మేము ఎంక్వయిరీ చేసినామనుకో వీళ్ళందరూ బొక్కల పడతారు.

ఇప్పుడు ముఖ్యమంత్రి దావోస్ పోయిండు కదా? ఆడికెల్లి హార్వర్డ్ పోతుండు కదా? 10 రోజులు టైం పాస్ చేయాలి కదా? అందుకే ఒక రోజు హరీష్ రావును, ఒక రోజు కేటీఆర్ ను పిలవండి... అని అదేశాలిచ్చారు ఇదొక అబ్సొల్యూట్ ట్రాష్ కేస్. ఇది బక్వాస్ కేస్. దీనిలో ఏమీ లేదు ఇది విచారణ చేస్తున్న పోలీసులకు కూడా తెలుసు. మొన్న హరీష్ రావు ని పిలిస్తే ఏమో కొత్త విషయాలు ఏమో చెప్తారేమో అనుకున్నా. ఏం లేదు అడిగిందే అడుగుడు, తిర్లమర్ల చేసి అడుగుడు, మరల తిర్లేసి అడుగుడు.

ప్రజలకు పనికొచ్చే ఒక్క పని ఈ ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేసిందా? ఒక్క మహిళకు రెండున్నర వేల రూపాయలు ఇచ్చిందా? దాని మీద చర్చ జరగద్దు. ఆరు గ్యారంటీల మీద చర్చ జరగద్దు. నూరు రోజులన్నది మర్చిపోవాలి. ఏమన్నా అంటే కెసిఆర్ అప్పులు చేసిండని దప్పు కొట్టాలి... దిక్కుమాలిన ఆలోచన తప్ప వాళ్ళు పీకేదేమీ లేదు వాళ్ళతో అయ్యేదేమీ లేదు. రేపు బరాబర్ పోతా, బరాబర్ మళ్ళీ చెప్పి వస్తా. నేను సిట్ వాళ్ళను... మీరు నా ఫోన్ ఇవాళ ట్యాప్ అవుతుందో లేదో చెప్పరి ముందు అని అడుగుతా.

రెండేళ్లయింది ఈ కేసు విచారణ ప్రారంభించి. తమ్ముడు ఒక మాట అన్నాడు కథనాలు వచ్చినాయి అని... ఎక్కడికెళ్లి వచ్చినాయి? ఎవరైనా ఒక అధికారి అఫీషియల్ గా ప్రెస్ మీట్ పెట్టిండా? ఎవరైనా మంత్రి అఫీషియల్ గా మాట్లాడిండా? ఎడికెల్లి వస్తున్నాయి ఇవన్నీ? లీకులు తప్ప ఇట్లా అయిందట. అట్లా అయిందట. అదిగో పులి ఇదిగో తోక. ఒక్కటంటే ఒక్క ప్రెస్ మీట్, ఒక్కటంటే ఒక్క అధికారిక వార్త ఏదైనా వచ్చిందా?

దావోస్ పోయిన ముఖ్యమంత్రి ఎక్కడ మా ఉపముఖ్య మంత్రి నా మీద కోపంగా ఉన్నాడు. బొగ్గు కుంభకోణంలో ఆయన వాటాను నేను ఏదో కొట్టేసే ప్రయత్నం చేసిన అని. కాబట్టి ఆయన నా కుర్చీ ఏమైనా గుంజుకుంటాడేమో అని ఏం చేయాలి? టైం పాస్ చేయాలి. ఓ రెండు రోజులు నోటీసుల పేరిట డ్రామా ఇయ్యాలి. మాకు ఇంకో రెండు రోజులకు ఇంకోళ్ళకు నోటీసు ఇస్తారు. ముఖ్యమంత్రి వచ్చేదాకా టైం పాస్ చేయమని చెప్పిపోయిండట, కాబట్టి టైం పాస్ చేస్తున్నారు.

కానీ ఒకటి మాత్రం వాస్తవం, మేము ఏ తప్పు చేయలేదు. ఏ తప్పు చేయలేదు కాబట్టి భయపడం.

శివధర్ రెడ్డి ఇవ్వాళ డీజీ, ఆ రోజు మా ఐజీ ఇంటెలిజెన్స్. ఆయనకు తెలవకుండానే జరిగిందా? మీరు చెప్పిన ఏదో వ్యతిరేక కార్యక్రమం? మరి ఆయన్నని ఎందుకు పిలుస్తలేరు? మహేందర్ రెడ్డి మా గవర్నమెంట్ లో ఐదేళ్లు డీజీపీ. మరి ఆయన్నని ఎందుకు పిలవరు? ఓన్లీ పొలిటికల్ లీడర్లని ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?

హోమ్ సెక్రటరీ ఎవరు ఉండే గతంలో? మొన్నటిదాకా డీజీపీగా ఉన్న జితేందర్ , రవి గుప్తా. వాళ్ళు ఎవరైనా పోయినరా విచారణకు? మరి ఏం జరుగుతుంది ఈ రాష్ట్రంలో? రాజకీయ వేధింపులు, రాజకీయ హరాస్మెంట్ తప్ప ఈ విచారణలో ఏముంది? ఏమన్నా విషయం ఉంటే ఈపాటికే నానా యాగీ చేయకపోతుంటే రేవంత్ రెడ్డి? ఇదో లొట్టపీసు కేసు, దీంట్లో ఏం లేదు.

ముఖ్యమంత్రి ఈ హౌల పనులు బంద్ చేయమని చెప్తున్నా. రేపు ఇదే అధికారులు, ఇదే అధికారులు ఎవరైతే ఈరోజు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారో వాళ్లకు కూడా తెలుసు. పోలీసులు బలిపశువులు అయ్యే ఒక కార్యక్రమం రాజకీయ క్రీడలో.

---


# బండి సంజయ్, కిషన్ రెడ్డి, అరవింద్ ఎందుకు నోరు మెదపడం లేదు?

- బీజేపీ నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారు? లోపాయికారీ ఒప్పందం ఉందా?
- వీరికి కూడా వాటాలు అందాయా?
- రేవంత్ రెడ్డి పిచ్చికి డైవర్షన్ పాలిటిక్స్ పరాకాష్ట
- బొగ్గు కుంభకోణం బయటపడిందనే కేటీఆర్ పై కుట్రలు
- నైనీ బొగ్గు బ్లాక్ లింకులు బయటపడటంతోనే కొత్త నాటకాలు
- హరీష్ రావు ఆధారాలతో సహా సృజన్ రెడ్డి బండారం బయటపెట్టారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**నిజామాబాద్:** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన పూర్తిగా అపహాస్యం పాలైంది. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాక, తన అవినీతి బండారం బయటపడుతుందనే భయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు, డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారు. అందులో భాగంగానే మొన్న హరీష్ రావు కు, నేడు కేటీఆర్ కి సిట్ నోటీసులు జారీ చేశారు. దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్న అని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.

బొగ్గు కుంభకోణం నుండి దృష్టి మళ్లించేందుకే నైనీ బొగ్గు బ్లాక్ కుంభకోణంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి పాత్ర ఉందని మా నాయకుడు హరీష్ రావు ఆధారాలతో సహా బయటపెట్టారు. మంత్రులు సైతం వాటాల కోసం కక్కుర్తి పడి కొట్టుకోవడం మీడియా సాక్షిగా ప్రజలందరికీ తెలిసింది. ఈ "బొగ్గు మసి"ని కడుక్కోలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకే మొన్న హరీష్ రావు గారికి నోటీసులని డ్రామా ఆడి, నేడు కేటీఆర్ ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఇది రేవంత్ రెడ్డి "పిచ్చి" పరాకాష్టకు చేరిందనడానికి నిదర్శనం.

ఇంత పెద్ద బొగ్గు కుంభకోణం జరిగితే బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి, అరవింద్




ఎందుకు నోరు మెదపడం లేదు? ఢిల్లీలో టెండర్లు రద్దయ్యే పరిస్థితి వచ్చినా స్థానిక బీజేపీ నేతలు మాట్లాడకపోవడం చూస్తుంటే.. వీరికి కూడా వాటాలు అందాయా అనే అనుమానం కలుగుతోంది. రేవంత్ రెడ్డి పాలన గాలికి వదిలేశారు. సివిల్ సప్లైస్, ఎక్సైజ్, మూసీ, ఫ్యూచర్ సిటీ, రియల్ ఎస్టేట్.. ఇలా ఏది ముట్టుకున్నా దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దొరికిన కాడికి దోచుకోవడం, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం తప్ప ఈ ప్రభుత్వానికి మరో పని లేదు.

మున్సిపల్ ఎన్నికల కోసమే ఈ కుట్రలు చేస్తున్నారు. కేటీఆర్ , హరీష్ రావు ని కట్టడి చేస్తే ఎన్నికల్లో లబ్ది పొందచ్చని రేవంత్ రెడ్డి కలలు కంటున్నారు. మేము మీ అక్రమ కేసులకు, పోలీసుల బెదిరింపులకు భయపడేది లేదు. న్యాయస్థానాల మీద మాకు గౌరవం ఉంది. న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ ఈ ప్రభుత్వాన్ని ఎండగడతాం. కేటీఆర్ గారి వెనుక బీఆర్ఎస్ పార్టీ మొత్తం, తెలంగాణ సమాజం బలంగా నిలబడింది. తక్షణమే ఈ కక్షసాధింపు చర్యలు ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

---

# నోటీసుల పేరుతో చేసే తాటాకు చప్పుళ్ళకు భయపడేది లేదు

**- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



**హైదరాబాద్:** నైనీ బొగ్గు కుంభకోణంలో బిఆర్ఎస్ పార్టీ సంధించిన ప్రశ్నలకు సమా ధానం చెప్పలేక, మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమి లేక, ప్రజలను బొగ్గు కుంభకోణం నుంచి దృష్టి మళ్లించేందుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోటీసులను జారీ చేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుంది. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బిఆర్ఎస్ నాయకులకు విచారణల పేరుతో నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ పాలన తీరు డైలీ సీరియల్‌ల మారింది. బొగ్గు కుంభకోణంలో వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి టెండర్లను రద్దు చేస్తామని చెబుతూనే ఈ అవినీతిలో ఎవరెవరు ఉన్నారు అనేది చెప్పకుండా డాటా వేసే ధోరణిని అవలంబిస్తుండడం కుంభకోణం జరిగిందనేది స్పష్టం చేస్తుంది.

కేంద్ర గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి సైట్ విజిట్ పద్ధతి లో జరిగిన అవినీతిపై దర్యాప్తు చేయకుండా ప్రభుత్వం కోరితేనే దర్యాప్తు చేస్తామన్నడం సిగ్గుచేటు. కాంగ్రెస్, బిజెపిలు కుమ్మక్కై ఈ కుంభకోణాన్ని బయటకు రాకుండా చూస్తున్నాయి, కానీ ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతతో ఈ అంశాన్ని దృష్టి మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారనేది స్పష్టమవుతా ఉన్నది. పదుల సంఖ్యలో టిఆర్ఎస్ నాయకులపై ఎంక్వైరీ కమిషన్లు వేయడం తప్ప, ప్రభుత్వం చేసింది ఏమీ లేదు. ప్రభుత్వం రెండేళ్లలో చేసింది ఏమీ లేక, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని పథకాలు, సంక్షేమంపై మా పార్టీ నాయకులను, అధికారులను ఇబ్బంది పెడుతూ రాష్ట్ర దాష్టీకాలకు పాల్పడుతున్నారు. నోటీసుల పేరుతో రేవంత్ ప్రభుత్వం చేసే తాటాకు చప్పుళ్లకు మా బిఆర్ఎస్ పార్టీ గానీ, పార్టీ నాయకులు గానీ భయపడే ప్రసక్తే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు పరిచే వరకు పోరాటం చేస్తూనే ఉంటాం.

తెలుగు దిన పత్రిక
https://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్





# ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి:** ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియలో రాష్ట్రంలోనే మన జిల్లా చివరిస్థానంలో ఉందని, ఈ నెలాఖరు వరకు ప్రక్రియలో ప్రత్యేక శ్రద్ధ వహించి పురోగతి సాధించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూపర్ వైజర్లను



ఆదేశించారు. గురువారం మల్కాజిగిరి డిప్యూటి కమిషనర్ కార్యాలయంలో ఓటరు జాబిత అనుసంధాన ప్రక్రియ పురోగతి పై కలెక్టర్ సమిక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 2002 నుండి ఉన్న ఓటరు జాబితాను 2025 ఓటరు జాబితాకు అనుగుణంగా సవరించే మ్యాపింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించే సూపర్ వైజర్లను, బిఎల్ ఓలను సస్పెండ్ చేయడం జరుగుతుందని ఆదేశించారు. తమ తమ బిఎల్ఓలతో సమావేశమై వారికి ప్రక్రియ పై పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత సూపర్ వైజర్లదే అన్నారు. మ్యాపింగ్ ప్రక్రియ పై సింగిల్ నంబరు శాతం ఉండడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓలు వైద్య, వ్యక్తిగత కారణాల వల్ల హాజరు కాని వారి స్థానంలో చురుకుగా పనిచేసే వారిని నియమించి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎఈఆర్ఓలు పూర్తి బాధ్యత తీసుకొని సూపర్ వైజర్లకు, బిఎల్ఓలకు రోజువారి లక్ష్యాలను ఇచ్చి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బిఎల్ఓలతో ఇంటింటికి వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలన చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియలో



నిర్లక్ష్యం వహించిన వారిని సస్పెండ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి డిప్యూటి కమిషనర్ ఝుకీరా సుల్తానా, మల్కాజిగిరి ఆర్డిఓ శ్యాంప్రకాష్, మల్కాజిగిరి తహసీల్దారు సీతారామ్, ఏఈఐఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ప్రాణాలకు రక్షణ కవచం

## సైబరాబాద్ పోలీసుల మానవీయ ముందస్తు చర్య

**అక్షర గళం, మియాపూర్:** పోలీసులంటే కేవలం శాంతి భద్రతల వరకే పరిమితం కాదంటూ.. ప్రజల ప్రాణాల పట్ల పోలీస్ శాఖకు ఉన్న బాధ్యత అని మియాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ అన్నారు. సమాజంలో అత్యంత దయనీయ స్థితిలో ఉన్నవారి ప్రాణాల రక్షణే లక్ష్యంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మియాపూర్ పోలీసులు మరోసారి బాధ్యతాయుతమైన, మానవీయ పోలీసింగ్‌కు ఉదాహరణగా నిలిచారు.

ఇటీవల మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో హిట్ అండ్ రన్ ఘటనలు నమోదవుతున్న పరిస్థితిని గమనించిన పోలీసులు, ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న భిక్షాటనదారుల ప్రాణాలకు తీవ్రమైన ప్రమాదం పొంచి ఉందని ముందే అంచనా వేసి, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడంకంటే ముందే నివారించాలన్న ఉద్దేశంతో ప్రత్యేకంగా ప్రివెంటివ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌ను మియాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ పర్యవేక్షణలో మియాపూర్ పోలీస్ సిబ్బంది సమన్వయంతో నిర్వహించి, ఉదయం వేళల్లో ఫుట్‌పాత్‌లపై నివసిస్తూ నిద్రిస్తున్న భిక్షాటన దారులను గుర్తించి వారి భద్రత, సంక్షేమాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకుని అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆలేటి అటమ్ వరల్డ్ ఆశ్రమానికి సురక్షితంగా తరలించారు. మొత్తం 22 మంది భిక్షాటన చేసేవారిని ఆశ్రమానికి చేర్చి, వారికి తాత్కాలిక నివాసం, ఆహారం, సంరక్షణ లభించేలా అవసరమైన ఏర్పాట్లు చేశారు. రాత్రి వేళల్లో వేగంగా ప్రయాణించే వాహనాల కారణంగా ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న నిరాశ్రయుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని, ఎలాంటి



అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు. మానవీయ దృక్పథం, ముందస్తు ఆలోచనకు నిదర్శనంగా నిలుస్తోందని, ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌తో పాటు మియాపూర్ పోలీస్ సిబ్బంది చూపిన చొరవను స్థానిక ప్రజలు, వాహనదారులు, పౌరులు ప్రశంసిస్తున్నారు.




# ఒక క్షణం నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారుతోంది

## సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ ఎ.సాయిమనోహర్

**అక్షరగళం, సైబరాబాద్:** ఒక క్షణం నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారుతోందని సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ ఎ సాయిమనోహర్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఆరైవ్ ఆలైవ్‌లో భాగంగా అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు రహదారి నియమ నిబంధనాలు పాటిస్తూ నిదానమే ప్రధానంగా ముందుకు సాగాలని అన్నారు. వాహన దారులు ఖచ్చితమైన నియమ నిబంధనలు పాటించాలన్నారు. అధిక వేగం, ఒవర్‌టేకింగ్, డ్రైవ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్, వాడకం ప్రాణ రక్షణకు కవచం లాంటివని..వీటిని నిర్లక్ష్యం చేయరాదన్నారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను అతిక్రమించకుండా, కుటుంబాల భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు.

రహదారి భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ అవగహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ హన్మంత్‌రావు, ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డితోపాటు వివిధ పోలీస్ ట్రాఫిక్ స్టేషన్‌లకు చెందిన ఇన్ స్పెక్టర్లు పాల్గొన్నారు

# ఫిబ్రవరి 4న జరిగే నిరుద్యోగుల మహా గర్జనతో నిరుద్యోగుల సత్తా ఏంటో చూపిస్తాం

## - నిరుద్యోగి జేఏసీ నేతలు

**అక్షర గళం, చిక్కడపల్లి:** ఫిబ్రవరి 4న జరిగే నిరుద్యోగుల మహా గర్జనతో నిరుద్యోగుల సత్తా ఏంటో ఈ ప్రభుత్వానికి తెలియజేస్తామని నిరుద్యోగి జేఏసీ నేతలు అన్నారు. గురువారం చిక్కడపల్లి సిటీ సెంటర్ లైబ్రరీలో గ్రూప్1 విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై నిరుద్యోగ జేఏసీ నేతలు ఒ పోటీ పరీక్షల అభ్యర్థులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఏరోజైనా న్యాయమే గెలుస్తుందని నిరుద్యోగ జేసి నేతలు పేర్కొన్నారు.

న్యాయస్థానాలపై తమకు గౌరవం ఉందనీ ఫిబ్రవరి 5 కు వచ్చే తీర్పు తమకు అనుకూలంగా ఉంటుందని తెలియజేశారు. ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో నోటిఫికేషన్లు విడుదల చేయకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. తక్షణమే జాబ్ క్యాలెండర్ నీ విడుదల చేసి ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

కాలయాపన చేయకుండా తక్షణమే నోటిఫికేషన్



లను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు శంకర్ నాయక్, బాలకోటి ,ఇంద్ర , శ్రీనివాస్ ,రవి రాథోడ్, భూక్య కుమార్, జనార్ధన్ ,రమేష్ ,గణేష్ ,సంపత్, సోమేష్ ,పవన్ ,సాయికిరణ్ ,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

**అక్షరగళం, పఠాన్‌చెరు:** బీసీ గురుకుల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో 2026 -27 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్ లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బీసీ గురుకుల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల అల్లాదుర్గ్, ఐనోల్ ప్రిన్సిపాల్ బి.స్రవంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో బీసీ,ఎస్సీ, ఎస్టీ ఏడాదికి సీట్లు భర్తీకి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల గడువు జనవరి25 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి కూడా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్రవంతి తెలిపారు. అర్హత పరీక్ష ఆధారంగా విద్యార్థుల సీట్ల ఎంపిక జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన బీసీ,ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య పౌష్టికాహారం, యూనిఫామ్, ఉన్నత ప్రమాణాలతో



కూడిన విద్యా అందించనున్నమని కావున అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 25వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్రవంతి కోరారు.

# ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యం

## మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి






చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. అనంతరం పలు కార్యక్రమాలలో పాల్గొనాలని వారిని ఆహ్వానించారు.





# సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి ఐనాక్స్ గ్రూప్ ఆసక్తి

**దావోస్:** తెలంగాణను కాలుష్య రహిత మహానగరంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ఐనాక్స్ గ్రూప్ డైరెక్టర్ దేవాంశ్ జైన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సోలార్ మాడ్యూల్స్ సహా ఆధునిక, సుస్థిర తయారీ రంగాల్లో సహకార అవకాశాలపై చర్చించారు. ఐనాక్స్ గ్రూప్ తెలంగాణలో సౌర , పవన విద్యుత్ ఉత్పత్తి చేపట్టి, ఆ తర్వాత తయారీ రంగంలోకి విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది.

రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కాలుష్యం లేని విద్యుత్ (క్లీన్ ఎలక్ట్రిసిటీ) , గ్రీన్ హైడ్రజన్ అందిచాలనే ప్రణాళికలు ప్రభుత్వం రూపొందిస్తున్నది అని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. డేటా సెంటర్ల నుంచి అధిక స్థాయిలో పునరుత్పాదక విద్యుత్ అవసరం పెరుగుతోందని చెప్పారు. నూతన తెలంగాణ ఎనర్జీ పాలసీ కింద అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా క్యూర్ ప్యూర్ రేర్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ , హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధి మా విధానం.. హిందుత్వం మా నినాదం


**కేంద్ర నిధులతోనే కరీంనగర్ కార్పొరేషన్ సహా మున్సిపాలిటీల్లో అభివృద్ధి**

**రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు నయాపైసా లేదు**

**కేంద్రం నుంచి భారీ నిధులతోపాటు సీఎస్సార్ నిధులు తీసుకొస్తా**

**అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

**కరీంనగర్:** రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో జరిగిన అభివృద్ధినే ఎజెండాగా ప్రజల్లోకి వెళ్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్, బీఆర్ఎస్ నేత కనుమల్ల విజయ గణపతి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. విజయ గణపతి దంపతులకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితో పాటు జమ్మికుంటకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు కూడా బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన బండి సంజయ్? కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు తన పార్లమెంట్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో ఏ మాత్రం అభివృద్ధి కనిపించినా అది పూర్తిగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల ద్వారానే సాధ్యమైందని అన్నారు. స్మార్ట్ సిటీ, అమృత్, స్వచ్ఛ భారత్ పథకాలు, ఆర్థిక సంఘాల నిధులతోనే మున్సిపాలిటీల్లో పనులు జరిగాయని పేర్కొన్నారు. అందుకే రాబోయే ఎన్నికల్లో 'అభివృద్ధి మా విధానం? హిందుత్వం మా నినాదం'తో ప్రజల ముందుకు వెళ్తామని తెలిపారు.



కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్ల పాలనలో మున్సిపాలిటీలకు నయాపైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికలు దగ్గరపడుతున్నాయని తెలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపనల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో లేని బీఆర్ఎస్‌కు ఓటేస్తే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. బీజేపీని ఆశీర్వదించి కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీల్లో అత్యధిక స్థానాల్లో గెలిపిస్తే కేంద్రం నుంచి భారీ నిధులతోపాటు సీఎస్సార్ నిధులు కూడా తీసుకొచ్చి అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, కరీంనగర్ మాజీ మేయర్ శంకర్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, జమ్మికుంట నేతలు ఆకుల రాజేందర్, పుప్పాల రఘు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో రథసప్తమి వేడుకలు

**భారీగా ఏర్పాట్లు చేసిన టిటిడి**

**2.50 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా**

**తిరుమల:** తిరుమల శ్రీవారి సన్నిధిలో ఈనెల 25న ఆదివారం రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. స్వామి దర్శనానికి 2.50 లక్షల మంది భక్తులు రథసప్తమి వేడుకలకు వస్తారని అంచనాతో ఏర్పట్లు చేశామని తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో.. ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి ఏర్పాట్ల వివరాలను ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. రథసప్తమి రోజున ఏడు వాహనసేవలపై మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనంతో ప్రారంభమై.. రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహన సేవతో వాహనసేవలు ముగుస్తాయి. వైకుంఠ ద్వార దర్శనాలు, బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాం. అలాగే రథసప్తమి వేడుకలను కూడా వైభవంగా నిర్వహిస్తాం. రద్దీ దృష్ట్యా తిరుపతిలో 24 నుంచి 26 వరకు సర్వదర్శనం టోకెన్ల జారీ రద్దు చేశామని తెలిపారు. మాడవీధుల్లో 3,700 మంది శ్రీవారి సేవకుల సాయంతో 14 రకాల వంటకాలతో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. 1,260 మంది పోలీసులు, 1200 మంది విజిలెన్స్ సిబ్బందితో భక్తులకు భద్రతా ఏర్పాట్లు చేశాం. ఆర్టీసీ బస్సుల ద్వారా 2,300 ట్రిపులు నడిచేలా ప్రణాళికలు రూపొందించాం. వాహనసేవల ముందు 56 కళా బృందాలతో ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు ఉంటాయి. అంతకుముందు తిరుమలలోని నాలుగు మాడవీధుల్లో తితిదే అధికారులతో కలిసి బీఆర్ నాయుడు తనిఖీలు చేశారు. రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తుల సౌకర్యాలపై తితిదే, విజిలెన్స్ అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు.

# దావోస్ పెట్టుబడులపై శ్వేత పత్రం విడుదల చేయండి

**- బిజెపి డిమాండ్**

**హైదరాబాద్, (అక్షర గళం):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీల పనితీరును సమీక్షించడంతో పాటు, రాష్ట్ర కమిటీ సభ్యులకు అప్పగించిన బాధ్యతలపై గత నాలుగు నెలల ఫలితాలను పరిశీలించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు సమర్థంగా వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అలాగే అనుబంధ విభాగాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. బీజేపీ అగ్రనేతలతో కలిసి రెండు ఉమ్మడి జిల్లాలకు ఒకటి చొప్పున మొత్తం ఐదు భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సింగరేణి, నైనీ కోల్ టెండర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కోరితే సీబీఐ విచారణకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలం నుంచీ ఇప్పటివరకు జరిగిన అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరగాలనేది బీజేపీ డిమాండ్ అని స్పష్టం చేశారు. అలాగే దావోస్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన పెట్టుబడులు ఎక్కడ పెట్టారో, వాటి ద్వారా ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారో ప్రజలకు స్పష్టంగా చూపించాలని సవాల్ విసిరారు. ఇప్పటివరకు రెండు దావోస్ పర్యటనల్లో వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



# ఉస్మానియాలో ప్రజాస్వామ్య గొంతుకల అణచివేత

**ప్రొఫెసర్ మనోహర్ సస్పెన్షన్‌పై గవర్నర్‌కు డాక్టర్ శ్రవణ్ దాసోజు ఫిర్యాదు**

**హైదరాబాద్, (అక్షర గళం):** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కెమిస్ట్రీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ బి.మనోహర్‌ను అక్రమంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ శ్రవణ్ కుమార్ దాసోజు గవర్నర్, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. జనవరి 12న జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులు ఏకపక్షంగా ఉన్నాయని, ఇది భావప్రకటనా స్వేచ్ఛను అణచివేసే చర్యగా ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో తక్షణ జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరారు. విశ్వవిద్యాలయాలు మేధో స్వేచ్ఛకు వేదికలుగా ఉండాల్సిన అవసరం ఉందని, పరిపాలనలోని లోపాలపై ప్రశ్నించినందుకే సీనియర్ ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని డాక్టర్ శ్రవణ్ విమర్శించారు. విచారణ లేకుండా శిక్ష విధించడం సర్వీస్ నిబంధనలకు విరుద్ధమని, ఇది రాజ్యాంగంలోని సమానత్వం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, గౌరవప్రదమైన జీవన హక్కులను ఉల్లంఘిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు మూడు డిమాండ్లు సమర్పించారు. ప్రొఫెసర్ మనోహర్ సస్పెన్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని, సంబంధిత రికార్డులపై విచారణ చేపట్టాలని, అలాగే విశ్వవిద్యాలయాలు రాజకీయాలకు అతీతంగా ప్రజాస్వామ్యబద్ధంగా పని చేసేలా మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. మేధో స్వేచ్ఛను కాపాడటం అందరి బాధ్యత అని డాక్టర్ శ్రవణ్ స్పష్టం చేశారు.




# ఈశా ఫౌండేషన్ ఫ్యూచర్ సిటీలో పెట్టొచ్చు కదా?

- ఈశా ఫౌండేషన్ కోసం భూములు ఇవ్వడానికి పేదల భూములే దొరికాయా?
- ధనవంతులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించే ఆశ్రమాల కోసం పేద ఎస్సీల భూములు కావాలా?
- పేదల భూములు చట్టవిరుద్ధంగా లాక్కుంటున్న రేవంత్ సర్కార్
- కేసిఆర్ ధనవంతులను చేయాలని చూస్తే,రేవంత్ అడ్డాకూలీలుగా మారుస్తున్నారు
- బలవంతంగా లాక్కుంటే,లగచర్ల స్ఫూర్తితో పోరాడుతం
- రేగడిదోస్వాడ, మక్తగూడెం, వెంకన్నగూడెం, తాళ్లపల్లి,తిమ్మారెడ్డి గూడెం గ్రామాల భూములు ఇచ్చేది లేదు
- అవసరమైతే రైతులను చంపి భూములుగా లాక్కోండి
- బి ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**షాబాద్:** ల్యాండ్ పూలింగ్ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చట్ట విరుద్ధంగా పేదల భూములను లాక్కుంటుందని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. భూములు ఎందుకోసం తీసుకుంటున్నారు? ఏం కంపెనీలు పెడతారు? ఎలాంటి అభివృద్ధి చేస్తారో చెప్పకుండా పేదలను మోసం చేసి అన్యాయంగా విలువైన భూములను ఆక్రమించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రజా ప్రయోజనాలు లేనపుడు ప్రభుత్వం పేదల భూములు సేకరించడం చట్టవిరుద్ధమన్నారు.

షాబాద్ మండలంలోని రేగడిదొస్వాడ,మక్తగూడెం, తాళ్లపల్లి, తిమ్మారెడండిగూడెం గ్రామాలకు చెందిన ఎస్సీల అసైన్డ్ భూములు బలవంతంగా లాక్కోవడాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈశా ఫౌండేషన్ కోసం భూములు ఇవ్వడానికి పేదల భూములే దొరికాయా? అందుకోసం ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాలు కేటాయించవచ్చు కదా అని నిలదీశారు. ధనవంతులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించే ఆశ్రమాల కోసం పేద ఎస్సీల భూములు కావాలా? అంటూ నిలదీశారు.

రేవంత్ రెడ్డి మేమూ భూస్వాములమేనని చెప్పుకున్నారు,మరి వాళ్ళ భూములను ఈశా ఫౌండేషన్ వారికి ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. ఈశా ఫౌండేషన్ వల్ల ఇక్కడి పేదలకు జరిగే లాభం ఏంటని అడిగారు. పేదలకు ఉద్యోగాలిస్తారా? చదువు చెప్తారా? హాస్పిటల్ నిర్మిస్తారా అంటూ ధ్వజమెత్తారు. దానివల్ల పేదలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు.

చేవెళ్ల సాక్షిగా మల్లిఖార్జున ఖర్గే సమక్షంలో, పేదల అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చాక, లగచర్లలో అల్లుడి ఫార్మా కంపెనీ కోసం గిరిజనుల భూమిని లక్కోవాలని చూశారని, ఇపుడు సద్గురు బాబా కోసం రేవంత్ బాబా ఎస్సీల భూములు లాక్కోవాలని చూస్తున్నారని మండిపడ్డారు.

కేసిఆర్ పేదలను పుట్టినప్పటి నుండి కేసిఆర్ కిట్ ఇచ్చి, గురుకులాలు పెట్టి డాక్టర్లను తయారు చేసి, పేదలకు మూడు ఎకరాల భూమి ఇచ్చి,దళిత బంధుతో వ్యాపారస్తులుగా తయారు చేయాలని చూశారన్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం పేదల భూములు లాక్కొని నిరాశ్రయులను చేసి,అడ్డా కూలీలుగా మార్చాలని చూస్తున్నారని విమర్శించారు.

కంపెనీలు పెట్టుకోవడానికి హైదరాబాద్ చుట్టుపక్కల వేల ఎకరాల భూమి అందుబాటులో ఉన్నా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్సీల భూమిని లాక్కొని వారి పొట్టకొట్టాలని చూస్తున్నారన్నారు. కంపెనీల కోసం కేటాయించిన భూములను హిల్ట్ పాలసీ కింద తక్కువ ధరకు అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి, అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ లో పెట్టే ప్రతి సంతకం, పేదలకు వ్యతిరేకంగానే చేస్తున్నారన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఒడిషాలో బొగ్గు కాంట్రాక్టు కోసం మహిళా ఐఏఎస్ అధికారిని గురించి చెడుగా ప్రచారం చేశారన్నారు.



దీనిని ప్రశ్నించినందుకు గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని మాట్లాడినందుకు మాజీ మంత్రి హరీష్ రావుకు నోటీసులు ఇచ్చి, 9 గంటల పాటు విచారణ పేరుతో వేధించారన్నారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ ఎస్టీల అసైన్డ్ భూములకు పట్టా బుక్ జారీచేసి,పేదలకు భూములపై సర్వ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే షాబాద్ మండలంలోని రేగడిదోస్వాడలో భూమి సేకరణకు ప్రయత్నం చేస్తే, లగచర్ల స్ఫూర్తిగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

2013 భూ సేకరణ చట్టం ప్రకారం, భూమి మార్కెట్ విలువకు 3 రెట్లు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అంతేకాకుండా భూమికి బదులు భూమే కావాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి పేదలకు న్యాయం జరిగేదాక పోరాడుతామన్నారు. రేగడిదోస్వాడ, మక్తగూడెం, వెంకన్నగూడెం, తాళ్లపల్లి,తిమ్మారెడ్డి గూడెం గ్రామాల భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే రైతులను చంపి భూములుగా లాక్కోండన్నారు. 70 ఏళ్ల నుండి భూమిని సాగు చేస్తున్న రైతులను అకస్మాత్తుగా వెళ్లమంటే ఎలా వెళ్తారన్నారు.

ప్రభుత్వం ఇలాగే మొండిగా వ్యవహరిస్తే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, హరీష్ రావు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో లగచర్ల వలే ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. షాబాద్ మాజీ జడ్పిటిసి అవినాష్ రెడ్డి నాయకత్వంలో జరిగిన సమావేశంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్,దేశమల్ల ఆంజనేయులు,విజయ్ ఆర్య,మాజీ సర్పంచ్ లు, ఎంపిటిసి లు తదితరులు పాల్గొన్నారు.

# 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్

**రూ.5వేల కోట్ల పెట్టుబడులు.. 4వేల మందికి ఉపాధి**

**యూపీసీ వోల్ట్‌తో తెలంగాణ ఒప్పందం**

**దావోస్:** తెలంగాణను దేశంలోనే ఏఐ డేటా సెంటర్ల హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని సాధించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం దావోస్‌లో యూపీసీ వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ సందర్భంగా యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ ఏపీఏసీ సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్ నిగమ్‌తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ సంస్థ భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐకు అనుకూలమైన అత్యాధునిక డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్‌ను కూడా నెలకొల్పనుంది.

ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే సుమారు 3వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. డేటా సెంటర్ పూర్తిస్థాయిలో ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణను సమతుల్యం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అధునాతన ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. నెట్ జీరో సిటీ అభివృద్ధి తెలంగాణ విజన్‌లో కీలక భాగమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా పాల్గొన్నారు.



# అంబరాన్నంటిన క్రీడా సంబరం

- సికింద్రాబాద్‌లో పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్ ప్రారంభం
- 15 రోజుల పాటు 30 మైదానాల్లో క్రీడా పోటీలు
- 35 వేల మంది క్రీడాకారుల నమోదు

**హైదరాబాద్, (అక్షర గళం):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రేరణతో దేశవ్యాప్తంగా క్రీడా సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యంగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏబీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్ 2025-26 ప్రారంభోత్సవం సోమవారం ఎల్బీ స్టేడియంలో ఘనంగా జరిగింది. ఈ క్రీడా మహోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో




కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా భారత బ్యాడ్మింటన్ జట్టు కోచ్ పుల్లెల గోపీచంద్, ఒలింపియన్ సైనా నెహ్వాల్, భారత మహిళా క్రికెటర్లు దయానా దేవిడ్, దృష్టి కేసరి తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సుమారు 15 రోజుల పాటు 30 మైదానాల్లో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో,




అథ్లెటిక్స్‌తో పాటు పలు ఇతర క్రీడల్లో పోటీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, అన్ని డివిజన్ల స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జూనియర్, డిగ్రీ, ఇంటర్ కాలేజీల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బస్తీల్లోని మహిళల కోసం ప్రత్యేకంగా మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహిస్తున్నామని, మీడియా ప్రతినిధుల కోసం కూడా ప్రత్యేక క్రీడా ఈవెంట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఈ ఏడాది తొలిసారిగా దివ్యాంగుల కోసం ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో పీఎం సంసద్ ఖేల్ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత క్రీడాకారులు విశేషంగా రాణిస్తున్నారని, భవిష్యత్తులో కామన్‌వెల్త్ గేమ్స్, ఒలింపిక్స్‌ను భారత్‌లో నిర్వహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీల్లో సుమారు 35 వేల మంది క్రీడాకారులు నమోదు చేసుకున్నారని, అందరూ తమ ప్రతిభను చాటుకుని ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన క్రీడాకారులు, నిర్వాహకులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# కాలీఫ్లవర్ రుచులు



### కాలీఫ్లవర్ వల్కనో

**కావలసినవి:** కాలీఫ్లవర్1 (పెద్దది), వైట్‌సాస్3 కప్పులు చీజ్అరకప్పు, ఉప్పుతగినంత మిరియాలపొడితగినంత వైట్‌సాస్ తయారీకి వెన్న ఒకటిన్నర టేబుల్ స్పూన్లు కార్న్‌ఫ్లోర్ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, పాలు 3కప్పులు

**తయారుచేసే విధానం:** ఒకసాస్‌లో వెన్నను కరిగించి, కార్న్‌ఫ్లోర్‌ను దానికి బాగా కలిపి పాలుపోయండి. సన్నని మంటమీద కలుపుతూ, సాస్ చిక్కబడేంతవరకూ ఉడికించండి. తగినంత ఉప్పును చేర్చండి వైట్‌సాస్ తయారవ్వతుంది. కాలీఫ్లవర్‌ను అడుగుచెక్కి శుభ్రంగా కడగండి. ప్రెషర్ కుక్కర్‌లో ఉంచి, ఉడికించండి. అరగంట ఉడికించి బయటకు తీయండి. ఉప్పు, మిరియాల పొడి దానిమీద చల్లండి. బేకింగ్ డిష్‌లో ఉంచి దానిమీద వైట్‌సాస్ పోయండి. తురిమిన చీజ్ చల్లి ఓవెన్‌లో ఉంచి, చీజ్ కరిగిన తరువాత బయటకు తీయండి. వేడిగా సర్వ్ చేయండి.

### షాహీ గోబీ మటర్

**కావలసినవి:** కాలీఫ్లవర్ ఒక కిలో పచ్చి బఠానీపావ్వకిలో, ఉల్లిపాయలు4 అల్లంఅంగుళం ముక్క, వెల్లుల్లిరేకలు10 జీలకర్రఒక టీ స్పూన్, గరం మసాలా ఒక టీస్పూన్ పచ్చిమిరపకాయలు4 లేక 6, ఆమ్‌చూర్అర టీస్పూన్ టమాటాలు అరకిలో, పెరుగుఅరకప్పు కోవాఒక టేబుల్‌స్పూన్ ఎండుద్రాక్ష రెండు టేబుల్ స్పూన్లు నెయ్యినాలుగు టేబుల్ స్పూన్లు కొత్తిమీరఒక కట్ట, ఉప్పురుచికి తగినంత

**తయారుచేసే విధానం:** బఠానీలను మెత్తగా ఉడికించి నీటిని వార్చి ఓ ప్రక్కన ఉంచండి. కాలీఫ్లవర్‌ను విడివిడిపూలుగా తరగండి. రెండు టేబుల్‌స్పూన్ల నేతిని వేడిచేసి కాలీఫ్లవర్ ముక్కలను కొంచెం ఎర్రబడేంతవరకు వేయించాలి. వెడల్పాటి పాన్‌లో మిగిలిన నేతిని వేడిచేసి అందులో తరిగిన ఉల్లిముక్కలు, రెండు పచ్చిమిరపకాయలు తరిగిన ముక్కలు, తరిగిన అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, ఆమ్‌చూర్ గరం మసాలా కలపాలి. తరిగిన టమాటా ముక్కలు వేసి, కలిపి వేయించి పెట్టుకున్న కాలీఫ్లవర్ ముక్కలు, ఎండు ద్రాక్ష, కోవాలను చేర్చి కలిపి, రెండు కప్పుల నీరు పోయండి. బఠానీలో వేసి పది నిమిషాలు ఉడికించండి. మిగిలిన పచ్చి మిరపకాయలను కొత్తిమీరను తరిగి పైన చల్లి వేడిగా వడ్డించండి.

# సూప్స్ అండ్ స్టాటర్స్

### బేబీ కార్న్ స్ట్రాటర్స్ ...

**కావల్సిన పదార్థాలు :** బేబీకార్న్ 15, పెరుగు సగం కప్పు, జీలకర్ర రెండు చెంచాలు, ఉప్పురుచికి తగినంత, మైదా 1/2కప్పు, మొక్కజొన్న పిండి సగం కప్పు, నిమ్మరసంఅరచెంచా, కారంఅరచెంచా, నూనె వేయించడానికి సరిపడా

**తయారీ విధానం:** ముందుగా బేబీ కార్న్ శుభ్రంగా కడిగి రెండు పొడవు ముక్కల్లా చేసుకోవాలి. ఓ గిన్నెలో సగం దాకా నీళ్ళు పోసి అందులో ఈ బేబీకార్న్ ముక్కలు వేసి స్టౌ మీద పెట్టాలి . నీళ్ళు కొద్దిగా వేడి అయ్యాక బేబీకార్న్ ముక్కల్ని వేయాలి. నీళ్లు మరిగాక దింపి బేబీకార్న్‌ని వేడినీటిలోనే ఉంచి పక్కకు పెట్టాలి. ఐదుని ముషాలయ్యాక నీటిని వంపేయాలి. ఓ గిన్నెలో పెరుగు, తగినంత ఉప్పు, చెంచా జీలకర్రపొడి తీసుకొని బాగా కలపాలి. ఇందులో బేబీకార్న్‌ని వేసి వాటిని పెరుగు బాగా పట్టేలా కలిని ఒక గంటసేపు అలాగే ఫ్రిజ్ లో ఉంచాలి. ఆలోపు మైదా, మొక్కజొన్న పిండి, మిగిలిన జీలకర్రపొడి,



కారం, మరికొంచెం ఉప్పు, నిమ్మరసం ఓ గిన్నెలో తీసుకొని నీళ్ళు పోసుకుంటూ చిక్కని పిండిలా కలుపుకోవాలి. ఇప్పుడు ఫ్రిజ్ లో ఉంచిన బేబీకార్న్‌ని తీసి మైదా మిశ్రమంలో ముంచి కాగుతున్న నూనెలో వేయాలి. అన్ని వైపులా ఎర్రగా వేగిన తర్వాత పక్కకు తీసేయాలి. కచెప్‌తో వేడి వేడిగా తింటే రుచికరంగా ఉంటాయి.

### పాలకూర, స్వీట్ కార్న్ సూప్

**కావల్సిన పదార్థాలు:** స్వీట్‌కార్న్ రెండు కప్పులు, వెల్లుల్లి తరుగు టేబుల్‌స్పూను, ఉప్పు తగినంత, మిరియాలపొడి రుచికి సరిపడా, పాలకూర తరుగు కప్పు, నూనె రెండు చెంచాలు, క్రీం కొద్దిగా.

**తయారీ విధానం:** పొయ్యిమీద బాణలి పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక వెల్లుల్లి తరుగు వేయించాలి. నిమిషమయ్యాక స్వీట్‌కార్న్ వేసి వేయించాలి. అవి కాస్త వేగాక నాలుగు కప్పుల నీళ్లు పోసి మంట పెంచాలి. అవి మరుగుతున్నప్పుడు తగినంత ఉప్పూ, మిరియాలపొడీ వేసి దింపేయాలి. ఆ నీళ్ల వేడి తగ్గాక స్వీట్‌కార్న్‌ని మిక్సీలో తీసుకుని మెత్తని గుజ్జులా చేసుకోవాలి. దీన్ని మళ్లీ నీళ్లలో వేసి పొయ్యిమీద పెట్టాలి. రెండు నిమిషాల తరవాత పాలకూర తరుగు వేసి మంట తగ్గించాలి. కాస్త ఉడికాక దింపేసి క్రీం వేస్తే చాలు.

### చికెన్ టిక్కా

**కావల్సిన పదార్థాలు:** ఎముకల్లేని చికెన్ ముక్కలు అరకేజీ, సెనగపిండి ఒకటిన్నర టేబుల్‌స్పూను, పెరుగు కప్పు, కారం చెంచా, మిరియాలపొడి, గరంమసాలా అరచెంచా చొప్పున, పసుపు పావుచెంచా, ఉప్పు తగినంత, ధనియాలపొడి అర చెంచా, కసూరీమేథీ ముప్పావుచెంచా, నిమ్మరసం టేబుల్‌స్పూను, బిర్యానీ మసాలా అరచెంచా.

**తయారీ విధానం:**

పైన సిద్ధంచేసుకున్న పదార్థాలన్నింటినీ ఓ గిన్నెలోకి తీసుకుని అన్నింటినీ బాగా కలపాలి. ఈ గిన్నెను ఫ్రిజ్‌లో అరగంట నుంచి గంట ఉంచాలి. తరవాత ఇవతలకు తీసి ఇనుప చువ్వలకు గుచ్చి నిప్పులమీద కాల్చుకోవాలి. ■

# నోరూరించే వంటలు.... చేయటంలో మెళకువలు!

**వంటగదిలో రుచికరమైన వంటలు చేయాలని చూస్తున్నారా? మంచి వంటకాలు ఎలా వుంటాయో మీరు ఊహించుకోవచ్చు. వంటగదిలో మీరు కొత్తగా ప్రవేశిస్తున్నారా? మీరు వంటలో నిపుణులైనా కాకపోయినా? మీరు వంటప్రక్రియలో, వండిన పదార్దాలను నిల్వ వుంచటంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనాలి. వంట చేసే చిట్కాలు, మెళకువలు ఇంతవరకు మీకు తెలియలేదా? ఆందోళన చెందకండి. మేము మీకు వంటగదిలోని పెనాలు, కూరగాయలు కోయటం వంటి అంశాలపై కొన్ని ఉపయోగకరమైన చిట్కాలు, మెళకువలు అందిస్తున్నాం. పరిశీలించండి.**

- వంటనూనె నిల్వ కంపు కొడుతూంటే, దానిలో ఎనిమిది లేదా పది నల్లటి మిరియాలు వేయండి. అది కొన్ని వారాలవరకు చెడు వాసన రాకుండా వుంటుంది.
- పంచదార డబ్బాకు చీమలు పడుతున్నాయా? చీమలు పట్టకుండా డబ్బాలో 3 లేదా 4 లవంగాలు పడేయండి. ఇక చీమలు అక్కడికిచేరవు.
- పప్పు దినుసులను డబ్బాలలో పోసే ముందు వాటిని వేయించండి. ఇలా చేస్తే వాటికి పురుగు, బూజు పట్టకుండా వుంటుంది.
- కొత్తిమీర కట్టలు ఫ్రిజ్‌లో పెట్టేటపుడు ఒక ప్లాస్టిక్ డబ్బాలో పెట్టి అందులో పెట్టండి. త్వరగా వాడకుండా వుంటాయి.
- బాండ్లీలో నూనె పొంగకుండా నూనె వేడి ఎక్కేటపుడే కొంచెం ఉప్పు వేయండి. నూనె పొంగకుండా వుంటుంది. లేదా అతి తక్కువగా పొంగుతుంది.
- పాలు త్వరగా తోడుకోవాలా? పాలలో కొద్దిగా జొన్న పిండి లేదా విటమిన్ సి టాబ్లెట్ వేయండి. గడ్డ పెరుగు తోడుకుంటుంది.
- యాపిల్ కోసిన తర్వాత దానిని ఉప్పు నీటిలో కడగండి. ఇక ఆ ఆపిల్ ముక్కలు ఎప్పటికి తాజాగా వుంటాయి.
- చికెన్ లేదా మటన్ లివర్‌ను పాలలో 15 నుండి 20 నిమిషాలు నానపెట్టి ఉడికించండి. అది మెత్తగా వుండటమే కాక, మంచి రుచిని కూడా ఇస్తుంది.
- ఆహారంలో గరిష్ట విలువ కొరకు కొద్ది చుక్కలు చింతపండు రసాన్ని వేయండి. పాలు అధికంగా మరిగి వాసనా? దానిలో కొద్దిగా ఉప్పు వేయండి. వాసన తగ్గుతుంది.
- గుడ్లు ఉడికించే ముందు అవి పగలకుండా కొద్దిగా ఉప్పు మరియు కొద్ది చుక్కలు వినేగర్ వేయండి.
- కేక్‌ను కోసేటపుడు, కత్తిని చల్లని నీటిలో కొంత సమయం వుంచండి. ఈ చర్య కేక్ సమంగా కోసేలా చేస్తుంది.
- ఉప్పును వర్షాకాలంలో గడ్డ కట్టకుండా వుంచటానికి గాను కొద్ది బియ్యాన్ని ఒక గుడ్డలో గట్టిగా కట్టి ఉప్పు డబ్బాలో వేయండి.
- పచ్చళ్ళు ఎపుడూ బూజు పడుతూంటాయి. బూజు పట్టకుండా ఒక చిన్న గుడ్డలో ఆవాలు మూట కట్టి దానిని పచ్చడి జాడీలో శుభ్రమైన చెంచాతో పెట్టి వుంచండి. పచ్చడి జాడీనుండి ఎపుడు బయటకు తీసినా, దానిని పొడి గరిటెతో తీయండి, గాలి చొరకుండా మూత గట్టిగా పెట్టండి.
- వెల్లుల్లి వలవకుండా వుండాలంటే, వాటి రెబ్బలు విడదీని వాటిని కొద్ది ఉప్పు, వినేగర్ తో కలిపి ఫ్రిజ్ లో వుంచండి. అవి చాలా రోజులు తాజాగా వుంటాయి.
- మీ ఫ్రిజ్‌లో చేపలు తాజాగా వుండాలంటే, పచ్చి చేపలను లేదా మాంసాన్ని బాగా కడగండి, పూర్తిగా ఎండపెట్టండి. వాటిని ప్లాస్టిక్ బేగ్‌లలో వుంచి రిఫ్రిజిరేటర్‌లో పెట్టండి.
- ప్రతిరోజూ వంట చేసే వారికి ఈ వంటింటి చిట్కాలు ఎంతో సహకరిస్తాయి. ఇవి ఆచరణలో పెడితే, వంట ఎంతో తేలిక. మీకు కనుక మరిన్ని చిట్కాలు తెలిసివున్నట్లయితే, మాకు వ్రాయండి. మీ అనుభవాలు మాతో పంచుకోండి.



# పంజాబీ దమ్ ఆలూ రెసిపి

**దమ్ ఆలూగా కూడా పిలిచే ఈ వంటకం చక్కగా ఉడికిన, మసాలా దినుసులన్నీ కూరబడిన ఆలూ, ఇంకా కస్తూరి మెంతులు, జీలకర్ర, జీడిపప్పు, ఏలకులు, దాల్చిన చెక్క, ఇతర భారతీయ దినుసులన్నీ వేసి నోరూరించే కూరల అద్భుతమైన కాంబినేషన్.**



పంజాబీ దమ్ ఆలూ వంటకం ప్రపంచంలోనే నోరూరించే పంజాబీ ఆహార స్టైల్ నుంచి వచ్చింది. మొదటిసారి రుచి చూసినప్పటినుండి అందరికీ అభిమాన ఆలూ రెసిపి అయిపోయింది. ఇది సులభంగా వండుకోగలిగే వంటకం,పైగా ఆఖరున నోరూరించే కూర తయారైనప్పుడు మనకి ఇంకా ఇంకా తినాలనిపించే వంటకం కాబట్టి పంజాబీ ఆలూ ఎన్నటికీ బోర్ కొట్టదు. పంజాబీ ఆహారంలోనే ముఖ్య వంటకమైన పంజాబీ ఆలూ రెసిపి భారతీయ ప్రసిద్ధ వంటకంగా ప్రపంచంలో పేరు తెచ్చుకుంది.దీన్ని మీరు దాదాపు ఏ పెళ్ళిలోనైనా ,ఇతర ఫంక్షన్లలోనైనా చూడవచ్చు. ఈ రెసిపిలో ప్రత్యేకత ఏంటంటే ఇది మామూలుగా పెరుగుకి సంబంధించిన తడి కూర అయినా కూడా, మనం దీన్ని పొడి దమ్ ఆలూ మసాలాగా మార్చుకుని ముఖ్య భోజనం ముందు వంటకంలా వడ్డించుకోవచ్చు.

### కావలసినవి

1.చిన్న బంగాళదుంపలు 15–18 2.కొత్తిమీర చేతికి పట్టినన్ని 3.టమాటా ప్యూరీ 3/4 కప్పు 4.పెరుగు 3/4కప్పు 5.నూనె 5చెంచాలు 6.ఉల్లిపాయ 1 కప్పు 7.అల్లంవెల్లుల్లి పేస్టు 1 చెంచా 8.జీలకర్ర 1 చెంచా 9. జీడిపప్పు 6–7 10. దాల్చినచెక్క 1 ముక్క 11.ఏలకులు1 12.లవంగాలు1 13.ధనియాలు 1చెంచా 14.కస్తూరి మెంతులు 1 చెంచా 15. పంచదార 1 చెంచా 16.కారం 1 చెంచా 17.ఉప్పు1 చెంచా 18. ఇంగువ1 చెంచా 19. బిర్యానీ ఆకు 1 20.పసుపు 1 చెంచా

### తయారు చేసే విధానం:

1. మిక్సీ జార్‌లో ధనియాలు, దినుసులు, జీడిపప్పు, జీలకర్ర అన్నీవేసి మెత్తని పొడిలా మిక్సీ పట్టండి.
2. కుక్కర్ తీసుకుని నీళ్ళు పోసి, బంగాళదుంపలు వేయండి.
3. బంగాళదుంపలు మెత్తగా అయ్యేవరకు కుక్కర్ లో ఉడికించండి.
4. బంగాళదుంపల తొక్కు తీసేసి, ఫోర్క్ తో ఆలూలలో గుచ్చండి. దానివలన దినుసులు లోపలి వరకూ వెళ్తాయని ఖచ్చితంగా తెలుస్తుంది.
5. ఒక పెనం తీసుకుని, నూనె వేసి, బంగాళదుంపల పైపొర గోధుమరంగులోకి మారేదాకా వేయించండి.
6. ఇంకో పెనం తీసుకుని, నూనె,బిర్యానీ ఆకు, అల్లం వెల్లుల్లి పేస్టు, ఉల్లిపాయ ముక్కలు వేసి ఉల్లిముక్కలు లేత బ్రౌన్ రంగులోకి మారేదాకా కలపండి.
7. టమాటా ప్యూరీని వేసి మళ్ళీ కలపండి.
8. ప్యూరీ గట్టిపడుతుంటే, మసాలా దినుసుల మిశ్రమాన్ని వేసి ఆపకుండా కలుపుతూ ఉండండి.
9. పెరుగు, కారం, ఉప్పు వేసి బాగా కలపండి
10. పసుపు, పంచదార వేసి 23నిమిషాలు కలిపి నీళ్ళు ఆఖరిలో పోయండి.
11. కస్తూరి మెంతులు వేసి ఒక నిమిషం కలపండి.
12. మూతలు ఉంచి కొన్ని నిమిషాలు ఉడకనివ్వండి, కూర గట్టిపడుతూ, అన్ని దినుసుల వాసన మీకు తెలుస్తుంది.
13. బంగాళదుంపలను ఈ కూరలో వేసి బాగా కలపండి.
14. బంగాళదుంపలు కూరలో వేసి ఉడికించాక, దమ్ ఆలూను బౌల్ లోకి తీయండి. 15.ఇక దీన్ని కొత్తిమీరతో పైన అలంకరించి చపాతీ లేదా పూరీకి పక్కన వంటకంలా వడ్డించండి.



# రుచికరమైన కాకరకాయ చిప్స్

**కావలసిన పదార్థాలు**

కాకరకాయలు – అరకిలో
ఎండుకొబ్బరి తురుము – పావుకప్పు
జీడిపప్పు – పావుకప్పు
పసుపు – 1 టీ స్పూన్
కారప్పూస – అరకప్పు
పంచదార – పావుకప్పులో సగం
జీలకర్ర 1 టీ స్పూన్
కరివేపాకు 1 కట్ట
కారం – 2 టీ స్పూన్లు
నూనె – అరకప్పు
ఉప్పు తగినంత

**తయారీ విధానం**

కాకరకాయలకు పొట్టు, లోపలి గింజలు తీసి గుండ్రంగా చిన్న ముక్కలు కోయాలి. వీటిలో ఉప్పు, పసుపు, మంచినీళ్లు పోసి ఉడికించి ఆ నీళ్లని వంపేయాలి. మళ్లీ వీటిలో పంచదార, మంచినీళ్లు పోసి ఉడికించి, మిగిలిన నీళ్లన్నీ పిండేయాలి.

బాండీలో నూనె వేడి చేసి జీలకర్ర, ఇంగువ, పసుపు, కరివేపాకు వేయించాలి. అందులోనే ఉడికించిన కాకరకాయ ముక్కలు కొద్దిగా వేయించాలి. తర్వాత ఎండుకొబ్బరి, కారప్పూస, వేయించిన జీడిపప్పు, కారం, ఉప్పు కలిపి చివర్లో కొత్తిమీర తరుగు చల్లాలి.

- పసుపు నీటితో వంటగదిని శుభ్రం చేయడం వల్ల ఈగలు దరి చేరవు.
- క్యాబేజీని ఉడికించే సమయంలో వాసన వస్తుంటుంది. వాసన రాకుండా ఉండాలంటే చిన్నం అల్లం ముక్క వేసి తేడాను గమనించండి.



## బోర్డర్-2 విడుదలకు గల్ఫ్ దేశాలు నిరాకరణ?

సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బోర్డర్ 2' జనవరి 23న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఆరు గల్ఫ్ దేశాల్లో 'బోర్డర్ 2' పై నిషేధం విధించినట్లు వార్తలు వస్తున్నాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాతో పాటు యూఏఈ లోనూ 'బోర్డర్ 2'ను నిషేధించినట్లు తెలుస్తోంది. గల్ఫ్‌లోని అన్ని థియేటర్లలో దీన్ని విడుదల చేయడానికి నిర్మాతలు ప్రయత్నిస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తెరకెక్కించడం వల్లే ఆయా దేశాలు దీన్ని బ్యాన్ చేసినట్లు తెలుస్తోంది గతేడాది చివర్లో విడుదలై సంచలనం సృష్టిస్తోన్న 'ధురంధర్'పై కూడా ఈ దేశాలు బ్యాన్ విధించిన విషయం తెలిసిందే. దీనిపై జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ చిత్రబృందం ప్రధాని మోదీకి కూడా లేఖ రాసింది. దీన్ని ఎక్కడైనా విడుదల చేసుకోవచ్చని ఎలాంటి అభ్యంతరకర సన్నివేశాలు లేవని సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిందని.. ఆ దేశాల్లో దీనిపై నిషేధం విధించడం భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమేనని ఆ లేఖలో మూవీటీమ్ పేర్కొంది. 'బోర్డర్ 2' విషయానికొస్తే.. భారత్– పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంతో తెరకెక్కిన హిట్ మూవీ 'బోర్డర్' 28 ఏళ్ల తర్వాత దానికి సీక్వెల్‌గా రూపొందింది సన్నీ దేవోల్ ప్రధాన పాత్రలో తొలి పార్ట్‌ను జె.పి.దత్తా తెరకెక్కించగా.. రెండో భాగాన్ని అనురాగ్ సింగ్ రూపొందించారు. సీక్వెల్‌లో వరుణ్ ధావన్, దిల్జీత్ దొసాంజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## 26న డేవిడ్ రెడ్డి ఫస్ట్ లుక్ విడుదల

మంచు మనోజ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చేసింది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న మనోజ్, ఇప్పుడు తన తదుపరి ప్రాజెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద గట్టి దెబ్బ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డేవిడ్ రెడ్డి' కి సంబంధించి కీలక ప్రకటన చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ జనవరి 26న, అంటే రిపబ్లిక్ డే సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో మెగా యాక్షన్ కోసం ఎదురుచూస్తున్న అభిమానుల్లో ఒక్కసారిగా జోష్ పెరిగింది.
ఒక భీకరమైన శకం మొదలవుతోంది అంటూ మనోజ్ పెట్టిన క్యాప్షన్ సినిమా ఏ రేంజ్ లో ఉండబోతుందో హింట్ ఇస్తోంది. ఈ చిత్రానికి హనుమ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా, 'కె.జి.ఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు. అంతేకాకుండా, ఎడిటర్ ఉజ్వల్ కులకర్ణి, ÷ట్ మాస్టర్ సుప్రీమ్ సుందర్ వంటి అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం పనిచేస్తుండటం విశేషం. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, హ్యాష్ ట్యాగ్‌లు చూస్తుంటే మనోజ్ ఈసారి మాస్ అండ్ వయోలెంట్ లుక్‌లో కనిపించబోతున్నట్లు అర్థమవుతోంది.



## ఓటిటి నెట్‌ఫ్లిక్స్‌లోకి దురంధర్

బాలీవుడ్‌లో ఎలాంటి భారీ అంచనాలు లేకుండా విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేసిన లేటెస్ట్ సెన్సేషన్ 'దురంధర్'. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్లింది. ఇండియన్ ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ యాక్షన్ డ్రామా ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా రూ.1400 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సరికొత్త రికార్డ్స్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ పాత్రలో నటించి మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకోగా, సారా అర్జున్ హీరోయిన్‌గా ఆకట్టుకుంది. అలాగే అక్షయ్ ఖన్నా చేసిన స్పెషల్ రోల్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. దురంధర్ మూవీ త్వరలోనే ఓటీటీలో విడుదల కానుంది. ఈ సినిమా ఓటీటీ హక్కులను ప్రముఖ స్ట్రీమింగ్ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్న విషయం తెలిసిందే.

తాజా సమాచారం ప్రకారం జనవరి 30 నుంచి దురంధర్ సినిమాను నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ వార్త బయటకు రావడంతో థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులతో పాటు, ఇప్పటికే చూసినవాళ్లు కూడా మళ్లీ మళ్లీ చూడాలని ఆసక్తి చూపిస్తున్నారు. ఓటీటీలో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. థియేటర్ కలెక్షన్లతోనే కాదు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోనూ కొత్త రికార్డ్స్ క్రియేట్ చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక ఈ సినిమాకు సీక్వెల్ కూడా రాబోతున్న విషయం తెలిసిందే. దురంధర్ సీక్వెల్‌ను మార్చి 19న విడుదల చేయనున్నట్టుగా మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు.



## విశాల్ మూవీ మొగుడు ప్రోమో విడుదల

తమిళ నటుడు విశాల్ మరో కొత్త సినిమాతో రాబోతున్నాడు. ఆయన కెరీర్‌లో 36వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. ఈ సినిమాకు హిట్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహించబోతుండగా.. వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న నాలుగవ చిత్రమిది. ఈ సినిమాకు తెలుగులో 'మొగుడు' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ప్రోమోను విడుదల విడుదల చేసింది.

గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'మగ మహారాజు', 'మదగజరాజా', 'యాక్షన్' సినిమాల తరహాలోనే ఈ సినిమా కూడా భారీ అంచనాలతో రూపొందుతోంది. ఈ సినిమాలో తమన్నా భాటియా హీరోయిన్‌గా నటిస్తుండగా, యోగిబాబు ఒక కీలక పాత్రలో అలరించబోతున్నారు. తాజాగా విడుదలైన ప్రోమో ఫుల్ ఫన్నీగా మరియు మాస్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉంది. ముఖ్యంగా 'మొగుడులా ఉండటం ముఖ్యం కాదు.. మొగుడు మొగుడులా ఉండటమే ముఖ్యం' అంటూ యోగిబాబు చెప్పే డైలాగ్ నవ్వులు పూయిస్తోంది. ఇందులో తమన్నా భర్తను శాసించే భార్యగా కనిపిస్తుంటే, విశాల్ ఇంట్లో పనులు చేసే అమాయకపు భర్తగా నటిస్తూనే.. భార్యకు తెలియకుండా బయట విలన్ల తాట తీసే మాస్ క్యారెక్టర్‌లో అదరగొట్టాడు.




## ఇక రెగ్యులర్ ధరలకే మనశంకర్ వరప్రసాద్ టిక్కెట్లు



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'మన శంకరవరప్రసాద్‌గారు'. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. అంతేకాదు, చిరంజీవి కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు రాబట్టిన మూవీగానూ రికార్డు సృష్టించింది. ఇప్పటివరకూ ఈ మూవీ రూ.300కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది.ఇన్ని రోజులు తెలుగు రాష్ట్రాల్లో పెంచిన టికెట్ ధరలు అమల్లో ఉండగా, ఇకనుంచి రెగ్యులర్ ధరకే టికెట్లు లభించనున్నాయి. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ మూవీకి రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు టికెట్ ధరలు పెంచుకునేందుకు పది రోజులు అనుమతి ఇచ్చాయి. ఇప్పుడు ఆ గడువు ముగియడంతో సాధారణ ధరకే టికెట్లు లభించనున్నాయి. ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌తో అలరిస్తున్న మూవీ నేటినుంచి మరింత ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంటుందని చిత్ర వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. చిరంజీవి నటన, అనిల్ రావిపూడి టేకింగ్, భీమ్స్ మ్యూజిక్, చివరిలో వెంకటేశ్ మెరుపులు సినిమాను విజయపథంలో నడిపాయి. మరోవైపు ఈ మూవీ ఓవర్సీస్‌లోనూ అదరగొడుతోంది. ఇప్పటివరకూ 4.2 మిలియన్ డాలర్లు వసూలు చేసి 5 మిలియన్ క్లబ్ వైపు పరుగులు తీస్తోంది. చిరంజీవి సినీ ప్రయాణంలో అతిపెద్ద విజయంగా 'మన శంకరవరప్రసాద్‌గారు' నిలవడంపై పవన్ కల్యాణ్‌కు చెందిన పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, చిరు బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపింది. 'మెగా బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సందర్భంగా చిరంజీవి గారికి, అలాగే చిత్ర యూనిట్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. చిరు అద్భుతమైన సినీ ప్రస్థానంలో ఇది మరో విజయవంతమైన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన అనిల్ రావిపూడి గారికి ప్రత్యేక అభినందనలు. చిరంజీవి, వెంకటేశ్ ఒకే తెరపై కలిసి కనిపించడం ప్రేక్షకులకు నిజంగా అపూర్వ ఆనందాన్ని కలిగించింది. భీమ్స్ సిసిరోలియో అద్భుత సంగీతం, ప్రేక్షకుల హృదయాలకు చేరువయ్యే చిత్రాన్ని అందించిన నిర్మాతలు సాహు గారపాటి, సుష్మితకు ప్రత్యేక అభినందనలు అని పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పేర్కొంది.



## చిరు మూవీలో కృతిశెట్టి

వాల్తేరు వీరయ్య' తర్వాత అగ్ర కథానాయకుడు చిరంజీవి, దర్శకుడు బాబీ కలిసి మరో సినిమా చేయబోతున్నారు. కూతురు సెంటిమెంట్ ప్రధానంగా సాగే కథతో ఈ చిత్రం రూపొందనున్నట్టు సమాచారం. ఇందులో కూతురు పాత్ర కోసం కృతిశెట్టి ఎంపిక దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈ సినిమాలోనే మలయాళ స్టార్ మమ్ముట్టి కూడా ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. దీనిపై త్వరలోనే ప్రకటన రానుంది.



PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154